



సఖినేటిపల్లి మండలం అంతర్వేదికరలో ఉప్పునీటి సాంద్రతతో తలలు వాల్చేసిన కొబ్బరిచెట్లు

రాజాధిరాజా..

రాజాధిరాజ అలంకరణలో గజవాహనంపై శ్రీవారి విహారం
ఘనంగా లక్షతులసీ పూజ మహోత్సవం
స్వామివారికి తిరుప్పావడ సేవ..
బ్రహ్మోత్సవాల్లో వైభవంగా ఏడో రోజు

6



రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు



ఉప్పునీటి సాంద్రతతో పంటలు.. ధ్వంసం

- తలలు వాల్చేస్తున్న కొబ్బరిచెట్లు, ఇతర ఫలవృక్షాలు
- ప్రభుత్వం అధ్యయన కమిటీని నియమించి ఆదుకోవాలి
- రాజోలు తీరం వెంబడి నెలకొన్న పరిస్థితులపై పరిశీలన చేయాలి
- త్వరలో డిప్యూటీ సీఎం పవన్ పర్యటన నేపథ్యంలో ఇక్కడా పర్యటించాలని రైతుల వినతి

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతం సముద్రతీరం వెండి గ్రామాల్లో ఉప్పునీటి సాంద్రతవల్ల పంటలు ధ్వంసమై ఉపాధి కరువుతున్న రైతుల పరిస్థితిపై ప్రభుత్వం అధ్యయనం చేయాలని తీర ప్రాంత గ్రామాల ప్రజలు కోరుతున్నారు. సముద్రపు కెరటాల ఉధృతితోపాటు ఆక్వాసాగు కారణంగా వేస్తున్న బోర్లవల్ల తీరప్రాంత గ్రామాల్లో ఉప్పునీటి సాంద్రత పెరిగి దశాబ్ధాల కాలంగా సాగుచేసుకుంటున్న భూములు నిరుపయోగంగా మారుతున్నాయి. పంటభూముల్లో ఏ పంటా పండట్లేదు. తీరం వెంబడి ఉన్న కొబ్బరిచెట్లు, సరుగుడు చెట్లు, ఇతర ఫల వృక్షాలన్నీ పూర్తిగా నిర్జీవమవుతున్నాయి. దీంతో వేల ఎకరాల పంట భూములు నాశనమై ఆ భూములనే నమ్ముకున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇందుకు సఖినేటిపల్లి మండలంలోని అంతర్వేదికర, పల్లిపాలెం, దేవస్థానంతోపాటు కేశవదాసుపాలెం పరిసర గ్రామాల్లో నెలకొన్న పంటలను, తలలు వాల్చిన కొబ్బరిచెట్లను ప్రభుత్వ ప్రతినిధులు పరిశీలించి వాటి సంరక్షణకోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ వ్యక్తమవుతోంది.

డిప్యూటీ సీఎం రాక నేపథ్యంలో..

ముఖ్యంగా డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ రాజోలు నియోజకవర్గ పరిధిలోని కేశనపల్లి ప్రధాన డ్రెయిన్‌లో కోట్ల వ్యయంతో డ్రెడ్జింగ్ పనులు చేయాలనే అంశంపై పరిశీలనకు త్వరలో రానున్న నేపథ్యంలో తీరప్రాంతంలో ఉన్న అన్నిగ్రామాల్లోనుఉన్న పరిస్థితులను అధ్యయనం చేసేందుకు నిపుణులతో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. తీరంలోని అన్నిప్రాంతాల్లోను పర్యటింప చేయడం ద్వారా తీరప్రాంత భూముల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయన కమిటీ నియామకానికి డిప్యూటీ సీఎం చొరవ చూపితే అంతర్వేదినుంచి యానాంవరకు ఉన్న తీర ప్రాంత భూములను సంరక్షణకు మార్గం సుగమవుతుందని పలువురు నిపుణులుఅభిప్రాయపడుతున్నారు.అంతర్వేది పల్లిపాలెంనుంచి దేవస్థానం, కర, కేశవదాసుపాలెం గ్రామాల్లో ఉన్న 3వేల ఎకరాలకుపైగా ఉన్న పంటలన్నీ ఉప్పునీటివల్ల ధ్వంసమై చెట్లన్నీ పూర్తిగా తలలు వాల్చేశాయని మానవహక్కుల వేదిక జిల్లా కార్యదర్శి ముత్యాల శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. రాజోలు ప్రజలంతా కేశనపల్లి డ్రెయిన్‌లో డ్రెడ్జింగ్ చేసిగట్లు ఎత్తుచేయాలనే డిమాండ్‌ను గట్టిగా వినిపిస్తున్నారు.దీంతో తీరప్రాంతంలో అధ్వాన పరిస్థితుల్లో ఉన్న తమ భూముల రక్షణకు ప్రభుత్వం చొరవ చూపాలని రైతులు కోరుతున్నారని ఆయన పేర్కొన్నారు. కేశనపల్లే కాకుండా రాజోలు నియోజకవర్గ పరిధిలోని అన్ని తీర గ్రామాల్లో కొబ్బరిచెట్టు అనేది నామ రూపాల్లేకుండా పోతోందని, తీరప్రాంత గ్రామాలన్నీ అధ్యయనం చేయాలని రైతులు కోరుతున్నారు. పరిస్థితి ఇలా ఉంటే రానున్న రోజుల్లో తీర ప్రాంత గ్రామాల్లో ఉప్పునీటి సాంద్రత అనూహ్యంగా పెరిగి తాగేందుకు మంచినీరు దొరకని నిస్సహాయ స్థితి ఏర్పడుతుందనేది వారి ఆందోళన. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ జోక్యం చేసుకుని తీరప్రాంత గ్రామాల్లోకి చొచ్చుకు వస్తున్న సముద్రం, ఆక్వాకల్చర్‌వల్ల ధ్వంసమవుతున్న పంట పొలాలతోపాటు ప్రస్తుత పర్యావరణ పరిస్థితులపై అధ్యయనం చేసేందుకు నిపుణుల కమిటీని నియమించి భవిష్యత్తులో పరిస్థితులు చేజారకుండా సంరక్షించాలని ప్రజలు కోరుతున్నారు.

'తెలుగు' వెలుగు



- బొమ్మూరులో ఎట్టకేలకు పూర్తిస్థాయి తెలుగు విశ్వవిద్యాలయం
- ఇన్‌చార్జి వీసీగా ఆచార్య డి.మునిరత్నంనాయుడు
- వర్సిటీ అభివృద్ధికి నిధుల విడుదలకూ ప్రతిపాదనలు
- 1986 ఏప్రిల్‌లో తెలుగు సాహిత్య పీఠానికి ఎన్టీఆర్ శంకుస్థాపన
- రాష్ట్ర విభజన తర్వాత తొలిగా విశ్వవిద్యాలయం ఏర్పాటు
- తెలుగుభాషకు, సాహిత్యానికి ఇక పూర్వవైభవం



మునిరత్నంనాయుడు



బొమ్మూరులోని విశ్వవిద్యాలయ పీఠం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

ఇది ఎన్నో ఏళ్ల నాటి కల... ఇన్నాళ్లకు కార్యరూపం దాల్చింది. రాజమహేంద్రవరంలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్తిస్థాయిలో రూపుదిద్దుకోబోతోంది. ఇప్పటివరకు బొమ్మూరులో తెలుగు విశ్వవిద్యాలయ పీఠం ఉంది. రాష్ట్ర విభజన తర్వాత ఇది పూర్తిస్థాయి యూనివర్సిటీగా మారుతుందని అందరూ ఆశించారు. అందుకు కొన్ని ప్రయత్నాలు జరిగాయి. గత ప్రభుత్వ హయాంలో దీన్ని పట్టించుకున్నది లేదు. ఎట్టకేలకు గత జూన్ నెలలో ఈ పీఠాన్ని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంగా రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపి నోటిఫికేషన్ ఇచ్చింది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ యూనివర్సిటీకి ఇన్‌చార్జి వీసీగా ప్రాచీన తెలుగు కేంద్రం మాజీ ప్రాజెక్టు డైరెక్టర్ డి.మునిరత్నంనాయుడుని నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో ఈ విశ్వవిద్యాలయంలో కదలిక వచ్చినట్టయింది. ఆయన బాధ్యతలు తీసుకున్న తర్వాత రిజిస్ట్రార్‌ను నియమిస్తారు. తర్వాత తెలుగు విశ్వవిద్యాలయం పరిపాలన మొదలవుతుంది. వాస్తవానికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటైన తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో ఉండేది. దానికి అనుబంధంగా మన రాష్ట్రంలో రాజమహేంద్రవరం, శ్రీశైలం, కూచిపూడిలో పీఠాలు ఏర్పాటయ్యాయి. గత ఏడాది జూన్ నాటికి రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తికావడం, విభజన చట్టం ప్రకారం హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయంతో అనుబంధ సేవలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో విశ్వవిద్యాలయాన్ని కేబినెట్ ఆమోదించినా వీసీ లేకపోవడంతో 2024-25 అడ్మిషన్లు జరగలేదు. సాధారణంగా జూన్‌లో నోటిఫికేషన్ ఇచ్చి ఆగస్టులో తరగతులు మొదలుపెట్టాలి. మరి ఈ విద్యా సంవత్సరాన్ని ఎలా మొదలెడతారో చూడాలి.

● రాష్ట్ర విభజన తర్వాత..

2014లో ఆంధ్రప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా విడిపోయిన తర్వాత ఏపీ రాష్ట్రంలో తెలుగు విశ్వవిద్యాలయం లేకుండా పోయింది. హైదరాబాద్ కేంద్రంగా ఉన్న విశ్వవిద్యాలయం పేరు మార్పుతోపాటు ఏపీలోని విశ్వవిద్యాలయానికి సంబంధించిన మూడు పీఠాల నిర్వహణ అధ్వానం అయింది. బొమ్మూరులోని తెలుగు పీఠంలో గత ఏడాది నుంచి అడ్మిషన్లు ఆగిపోయాయి. జూలై 3వ తేదీన ఎంఏ తెలుగు చివరి బ్యాచ్ పరీక్షలు పూర్తి ఇక ఈ పీఠం ఉనికి ప్రశ్నార్థకమైంది. ఇటువంటి పరిస్థితిలో రాజమండ్రిలో తెలుగువిశ్వవిద్యాలయం ప్రధాన కార్యాలయం ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన ఈ పీఠానికే కాకుండా రాష్ట్ర ప్రజలకే ఓ తీయని శుభవార్తను అందించినట్టు అయింది. తెలుగు భాషకు, తెలుగు సాహిత్యానికి, తెలుగు కళలకు పూర్వ వైభవం వస్తుందనే అభిప్రాయం మొలకెత్తింది. ఆదికవి నన్నయ్య భారతాన్ని తెలుగులోకి అనువదించిన నేల రాజమహేంద్రవరం. తెలుగు సాంస్కృతిక, సాహిత్య వైభవం విరజిల్లిన ప్రాంతమిది. ఇక్కడ 1986 ఏప్రిల్‌లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు తెలుగు భాషను ప్రోత్సహించే లక్ష్యంతో హైదరాబాద్‌లో ఉన్న తెలుగువిశ్వవిద్యాలయానికి అనుబంధంగా బొమ్మూరులో పొట్టి శ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయ పీఠం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అదే సమయంలో రాష్ట్రంలో శ్రీశైలం, కూచిపూడిలలో కూడా తెలుగు విశ్వవిద్యాలయ పీఠాలు ఏర్పాటుచేశారు. తర్వాత బొమ్మూరు తెలుగు పీఠం ఓ వెలుగు వెలిగింది.

● తెలుగుసాహిత్య పీఠం నుంచి...

రాజమండ్రిలోని బొమ్మూరు కొండ మీద సుమారు 45 ఎకరాల భూమిలో తెలుగు సాహిత్య పీఠం ఉండగా, అదిప్పుడు తెలుగు విశ్వవిద్యాలయంగా విరాజిల్లనుంది. 1986లో ఈ పీఠానికి మొత్తం 45 ఎకరాల స్థలాన్ని అధికారికంగా ఇవ్వడంతోపాటు సమీపంలోని మరో 10 ఎకరాల భూమిని కూడా దఖలు పరిచారు. అడ్మినిస్ట్రేషన్ భవనం, దానిలో తరగతుల నిర్వహణ, హాస్టల్, హాస్టల్ మెస్, నాలుగు క్వార్టర్స్ కూడా నిర్మించారు. తొలి పీఠాధిపతిగా కొత్తపల్లి వీరభద్రరావు నియమితులయ్యారు. తర్వాత వరసగా బేతవోలు రామబ్రహ్మం, ఆర్వీఎస్ సుందరం, సి.రమణయ్య, బేతవోలు రామబ్రహ్మం, సి.రమణ్య, పొన్నా లీలావతి, ఎండ్లూరి సుధాకర్, గొల్లకోట సూర్య భాస్కరావు, చివరగా మళ్లీ ఎండ్లూరి సుధాకర్ ఇక్కడ పీఠాధిపతులుగా వ్యవహరించారు. తెలుగు సాహిత్య సభలకు, మరెన్నో గోష్ఠులకు ఈ కేంద్రం విలసిల్లింది. ఇక్కడ తెలుగు ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ తరగతులు నిర్వహించేవారు. మొదట తరగతికి 25 మంది విద్యార్థులతో ఇది మొదలైంది. ఇక్కడ ప్రముఖ ప్రవచనకారుడు గరికిపాటి నరసింహారావు తొలి ఎంఫిల్ బ్యాచ్ పట్టా పొందారు. ప్రముఖకవి అద్దేపల్లి రామమోహనరావు, విమర్శకుడు ద్వానాశాస్త్రి ఇక్కడ పీహెచ్‌డీ చేశారు. ఇక్కడ 300 మంది పీ హెచ్‌డీలు చేయగా, సుమారు 450 మంది ఎంఫిల్ చేశారు. 550 మంది తెలుగు ఎంఏ చేశారు.

● ప్రస్తుత పరిస్థితి

ఇక్కడ 14 మంది ఉద్యోగులు మాత్రం ఉన్నారు. అందులో కొందరు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. భవనాలు దాదాపు శిథిలమయ్యాయి. కేవలం 20 ఎకరాల స్థలం మాత్రం మిగిలింది. కానీ ముఖ్యంగా 29 వేల పుస్తకాలతో గ్రంథాలయం మాత్రం నిత్యనూతనంగా ఉండడం విశేషం. ఇక్కడ ఉద్యోగులకు జీతాలు కూడా రాని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో బొమ్మూరు కొండపై ఉన్న భవనాలను ఆధునికీకరించాల్సిన అవసరం ఉంది. విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేసేందుకు ప్రారంభ బడ్జెట్ కింద రూ.20 కోట్లు, జీతభత్యాలు-మౌలిక సదుపాయాల కింద మరో రూ.30 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. హైదరాబాద్ తెలుగువిశ్వవిద్యాలయంలో మొత్తం 22 విభాగాలు, 40 కోర్సులు ఉన్నాయి. వీటన్నింటినీ ఇక్కడ ప్రారంభించాలంటే 72 బోధన పోస్టులు, 115 బోధనేతర పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. అయితే ప్రస్తుతానికి డిమాండు ఉన్న కోర్సులను ప్రారంభించే అవకాశం మాత్రమే ఉంది. ఇది ఇక తెలుగుభాషా సాహిత్యం, సంస్కృతిలో ఉన్నత స్థాయి అధ్యయనం, బోధన, పరిశోధనా కేంద్రంగా పనిచేయనుంది.

కోనసీమ ఫొటోగ్రాఫర్లకు సేఫ్టీ ఐడీ



ఫొటోగ్రాఫర్ల సేఫ్టీ ఐడీని ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాహుల్‌మీనా

అమలాపురంటౌన్,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్ అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, వృత్తి నైపుణ్యాల భద్రత కోసం సేఫ్టీ ఐడీ స్టిక్కర్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయం అందించే లక్ష్యంతో రూపొందించిన క్యూ ఆర్ కోడ్ లింక్‌ను జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా గురువారం ఆవిష్కరించారు. ఫొటోగ్రాఫర్లు, వాహనాలపై ఈ స్టిక్కర్‌ను అతికించుకోవాల్సి ఉంటుంది. ప్రమాదం, అత్యవసర సమయంలో ఎవరైనా ఈ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ వ్యక్తి సమస్త సమాచారం తెలుసుకునేలా ఏర్పాటు చేశారు. దీనివల్ల ప్రాణనష్టాన్ని తగ్గించడంతోపాటు వృత్తిపరమైన సందేహాలు, తనిఖీల సమయాల్లో ఎంతో ఉపకరిస్తుందని వివరించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ టెక్నాలజీని ఉపయోగించుకుని ఫొటోగ్రాఫర్లు తమభద్రతకోసం తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, జిల్లాశాఖ అధ్యక్షుడు గెద్దం సురేష్‌కుమార్, కార్యదర్శి దొరబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శి గీతారమణ, వివిధ మండలాల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వరరావు, వైవీ, రాము, సురేంద్ర, చక్రవర్తి, రామకృష్ణ, సూర్యనారాయణ పాల్గొన్నారు. భద్రత కోసం సేఫ్టీ ఐడీ స్టిక్కర్ వ్యవస్థను రూపొందించిన ఫొటోగ్రాఫర్లను ఎస్పీ అభినందించారు.

మద్యం స్వచ్ఛతను తెలిపేందుకు సురక్షా యాప్



మద్యంషాపులో స్కానింగ్ విధానాన్ని వివరిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

అమలాపురంటౌన్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మద్యం స్వచ్ఛతను తెలుసుకునేందుకు వీలుగా ప్రభుత్వం తీసుకువచ్చిన సురక్షా యాప్ గురించి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కేవీడీ ప్రసాద్ వివరించారు. అమలాపురం పట్టణంతోపాటు పరిసర గ్రామాల్లోని మద్యంషాపుల్లో గురువారం మద్యం సురక్షా యాప్ గురించి వివరించారు. సురక్షా యాప్‌తో మద్యం పూర్తి సమాచారాన్ని తెలుసుకునే అవకాశాన్ని యాప్ ద్వారా కల్పించారు. సంబంధిత యాప్‌పై మద్యం షాపుల నిర్వాహకులతో పాటు మందుబాబులకు సైతం అవగాహన కల్పిస్తున్నారు. గూగుల్ ప్లేస్టోర్‌లో సురక్షా యాప్ గురించి ఉన్న పూర్తి సమాచారాన్ని వివరించారు. ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ, ఎక్సైజ్ ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల నిర్వాహకులకు హెచ్చరికలు

అమలాపురం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం బెల్టుషాపులు నిర్వహించరాదని ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ హెచ్చరించారు. అమలాపురం, అంబాజీపేట, అల్లవరం, ఉప్పలగుప్తం, అయినవిల్లి మండలాల్లో గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని అందించే విధంగా చర్యలు తీసుకుందని వివరించారు. స్కానింగ్ విధానంలో ఎక్కడైనా బెల్టుషాపుల వద్ద మద్యం లభిస్తే సంబంధిత షాపులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు

- హైవేలో ప్రమాద కూడళ్లను గుర్తించి రక్షణకు చర్యలు
- మందుగుండు తయారీ కేంద్రాలపై 50 కేసుల నమోదు
- పి.గన్నవరం పోలీస్‌స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీలో ఎస్పీ



ఎస్పీ రాహుల్‌మీనా

పి.గన్నవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేకచర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా తెలిపారు. వాహనాల రద్దీ దృష్ట్యా ఆయా ప్రదేశాలను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. పి.గన్నవరం పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆయనఆకస్మికంగా తనిఖీచేశారు. అనంతరం మాట్లాడారు. జిల్లా పరిధిలోఉన్న 216 జాతీయ రహదారికి సంబంధించి హైవే అథారిటీ అధికారులతో మాట్లాడి తరచూ ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి రక్షణచర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. జిల్లాలో మందుగుండు సామాగ్రి తయారీ కేంద్రంతోపాటు ఒక షాపులో జరిగిన ప్రమాద ఘటన దృష్ట్యా బాణసంచా దుకాణాలు, తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిపెట్టామని తెలిపారు. ప్రమాదాలకు ముందు గతంలోనే దీపావళి పండుగను పురస్కరించుకుని మందుగుండు తయారీ కేంద్రాల్లో భద్రతా లోపాలు ఉంటే కేసులు నమోదు చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 50కేసులు వరకు నమోదు చేశామన్నారు. గతంలో షాపులు నిర్వహించిన ప్రదేశాలు, షాపులు తదితర ప్రాం తాలను పోలీసు, రెవెన్యూ, ఫైర్ అధికారులు సంయుక్తంగా పరిశీలన చేస్తున్నారని వివరించారు. పి.గన్నవరం పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించామని, కేసులు, లాఅండ్‌ఆర్డర్ పరంగా సంతృప్తి వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. మండలవ్యాప్తంగా ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంపై ఎస్‌ఐ బి.శివకృష్ణను అభినందించారు. అనంతరం స్టేషన్‌లో సిబ్బంది సమస్యలు,స్థానిక సమస్యలు ఇతరఅంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తులో పెండింగ్ ఉన్నాయా అనే విషయాలపై సమీక్షించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

చీరమేను.. సందడి



6

- యానాం మార్కెట్‌లో శేరు రూ.1,500

బిందెలో చీరమేనుతో మహిళ

వసతిగృహాల్లో విపస్యన జ్ఞానసాధనను పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టాలి

- ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంల సమావేశంలో కలెక్టర్ ఆదేశం



హాస్టల్స్ ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలతో మాట్లాడుతున్న కలెక్టర్

అమలాపురం,అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సమాజంలో మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ఆశ్రమ పాఠశాలల్లో అన్ని వయసుల విద్యార్థులకు విపస్యన జ్ఞానసాధనను పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టి విద్యార్థుల్లో క్రమశిక్షణ, చదువుల పట్ల ఆసక్తి, ఏకాగ్రత పెరిగేలా అవగాహన తీసుకురావాలని కలెక్టర్ మహేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.అమలాపురం కలెక్టరేట్‌లో గురువారం సాంఘిక, బీసీ సంక్షేమ వసతిగృహాల ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. మూడునెలలపాటు విపస్యన జ్ఞాన సాధన కార్యక్రమాల పురోగతిపై సమీక్షించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మానసికస్థితి, విద్యపట్ల ఆసక్తి వంటి 12 పారామీటర్ల వారీగా ప్రోగ్రెస్‌కార్డులు రూపొందించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులకు ఏడాదిపాటు ఈ శిక్షణ కార్యక్రమాన్ని తరగతి టీచర్లు, వలంటీర్లకు పదిరోజులపాటు శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. జేసీ టి.నిషాంతి, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మీ, మొబలైజేషన్ అధికారి సుబ్రహ్మణ్యం, విపస్యన ఆచారప్రతినిధి అమర్ పాల్గొన్నారు.

మట్టి పాత్రలను ప్రోత్సహించేలా చర్యలు

- రాష్ట్ర శాలివాహన సంక్షేమ, అభివృద్ధి చైర్మన్ పేరేపి ఈశ్వర్

అంబాజీపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కుమ్మరి కులవృత్తిదారులు తయారు చేసే పాత్రలు తయారీని ప్రభుత్వం ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటామని కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి చైర్మన్ పేరేపి ఈశ్వర్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా మాచవరంలోని కోనసీమ కుమ్మరి శాలివాహన సంఘ భవనంలో జిల్లాలోని కుమ్మరి శాలివాహన సంఘీయులతో సమావేశం నిర్వహించారు. మండలంలోని గంగలకుర్రులో కుమ్మరివృత్తిదారులు తయారుచేస్తున్న మట్టికుండలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం చైర్మన్ ఈశ్వర్ మాట్లాడుతూ కుమ్మరి కులవృత్తికి పునర్జీవం పోసేలా ప్రభుత్వంనుంచి ప్రోత్సాహకాలు అందేందుకు కృషి చేస్తానన్నారు. పర్యావరణానికి హితం కలిగేలా టెర్రాకోట్ వస్తువులను రాయలసీమలో తయారుచేస్తున్నారన్నారు. ఈ ప్రాంతంలో మట్టితో తయారు చేసిన భోజనం ప్లేట్లు, టీకప్పులు, గ్లాసులు, కుండలు, వంటపాత్రల తయారీని చేపట్టి విక్రయిస్తున్నారన్నారు. వీటిని హస్తకళాల చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్‌తో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ఎగ్జిబిషన్ నిర్వహించి మార్కెటింగ్ చేసేలా కృషిచేస్తామన్నారు. శాలివాహన డైరెక్టర్ మాచవరపు విజయ్ కుమార్, అధికార ప్రతినిధి ఆదుర్తి నారాయణ మూర్తి, పాలకొల్లు వెంకటరమణ, చిరతపూడి వెంకటేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

నవంబరు 12 నుంచి కోనసీమ క్రీడోత్సవాలు

- బాలయోగి స్టేడియంలో నిర్వహణకు ఏర్పాట్లు: కలెక్టర్

అమలాపురం,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని, శారీరక ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి కోనసీమ క్రీడా ఉత్సవాలు దోహదపడతాయని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు.ఈ క్రీడాఉత్సవాలు క్రీడాస్ఫూర్తిని చాటేలా నిర్వహించాలని కలెక్టరేట్‌లో గురువారం జరిగిన విద్యాశాఖ, మున్సిపల్ అధికారుల సమావేశంలో ఆదేశించారు. నవంబరు మొదటివారంలో ప్రాథమిక స్థాయి, మండలస్థాయి క్రీడా పోటీలను పూర్తిచేయాలని, ఆరో తరగతినుంచి ఇంటర్ వరకు క్రీడా పోటీలను జిల్లాస్థాయిలో నవంబరు 12 నుంచి మూడురోజులపాటు అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో నిర్వహించాలని ఆదేశించారు. కోనసీమ స్థాయిలో ప్రాథమిక ఉన్నతస్థాయి పాఠశాల విద్యార్థులు క్రీడోత్సవాల్లో పాల్గొని ప్రతిభ చాటాలని సూచించారు. ప్రాంతీయస్థాయి ఈవెంట్ కావడంవల్ల విద్యార్థుల అభిరుచి, కలసికట్టుగా పనిచేయడం, సామర్థ్యం, వారి ప్రతిభలు వెలుగులోకి వస్తాయన్నారు. జేసీ టి.నిషాంతి, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మీ, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, జిల్లాసైన్స్ అధికారి సుబ్రహ్మణ్యం, ఉపవిద్యాశాఖాధికారి బీవీ సుబ్రహ్మణ్యం, వ్యాయామ ఉపాధ్యాయుడు భీమేష్ పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

అమలాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):అమలాపురంలోని జీకే గ్రాండ్‌తోపాటు హోటల్ విష్ణుశ్రీలో ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు.ఆహార తయారీ వంటశాలను పరిశీలించారు. ఇటీవల ఒక హోటల్‌నుంచి తెచ్చుకున్న ఆహారం తిని ఒకరు మృతిచెందగా మరో ఇద్దరు అస్వస్థతకు గురయ్యారన్న కథనాల నేపథ్యంలో ఫుడ్‌సేఫ్టీ అధికారులు ఈ తనిఖీలు చేపట్టారు. ఫుడ్‌అండ్ సేఫ్టీ అధికారి జె.రామయ్య, అమలాపురం మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ పాల్గొన్నారు. శాంపిల్స్ తీసుకుని పరీక్షిస్తున్నారు.





బ్రహ్మోత్సవాల్లో ఉత్సవమూర్తులకు మహా స్నపనం (పక్కన) లక్ష తులసి పూజ

రాజాధిరాజా..

రాజాధిరాజ అలంకరణలో

గజ వాహనంపై శ్రీవారి విహారం

ఘనంగా లక్షతులసి పూజా మహోత్సవం

స్వామివారికి తిరుప్పావడ సేవ..

బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు





వరుసగా.. స్వామివారికి మిరియాల దండను తీసుకు వస్తున్న ఎమ్మెల్యే సత్యానంద రావు.. తిరుప్పావడ సేవ.. ప్రత్యేక నృత్య ప్రదర్శన

ఆత్రేయపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలను ఏడవ రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వసంతమండపంలో వివిధ రకాల ఫల, పుష్పాలతో అలంకరించిన మండపంలో ఉత్సవమూర్తులు కొలువుతీరారు. ఉత్సవమూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనము, అష్టకలశారాధన, స్నపనము వంటివి వేదమంత్రాల మధ్య నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ప్రముఖ డోనర్ బొరుసు భాస్కరరావు-వసుధ దంపతులు పూజల్లో పాల్గొన్నారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రచారం ఖండవల్లి వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు, అర్చకులు లక్ష తులసి పూజా మహోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్ ఎదురుగా అంతరాలయంలో తిరుప్పావడ సేవ నిర్వహించారు. అశేష భక్తజనం పాల్గొని కనులారా స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పూజల్లో పాల్గొన్నారు. రాత్రి రాజాధిరాజ అలంకరణలో శ్రీవారు అలంకృతుడై గజ వాహనం ఆధిరోహించి వేలాది మంది భక్తుల గోవిందనామస్మరణతో తిరు వీధుల్లో విహరించి భక్తులకు అభయహస్తం అందించారు.





వాడపల్లి వేంకటేశ్వరస్వామి మహాలడ్డు ప్రసాదాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

వెంకన్న ఆలయంలో మహాలడ్డు ప్రసాదం

450 గ్రాముల ధర రూ.100.. ప్రారంభించిన బండారు

ఆత్రేయపురం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా మహాలడ్డు ప్రసాదాన్ని ప్రవేశపెట్టారు. తిరుమల తరహాలో లడ్డు ప్రసాదాన్ని నాణ్యతా ప్రమాణంతో నిర్వహిస్తున్నారు. 450 గ్రాములతో తయారు చేసిన లడ్డును బాక్సులో ప్యాక్ చేసి రూ.100 ధరతో భక్తులకు అందించేలా నిర్ణయించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రసాదాన్ని భక్తులకు అందించే కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పాల్గొన్నారు.



ప్రధాని సభకు ముస్లిం మహిళలు



సభకు వేలాది బస్సులు ఇలా...



మోదీతో చంద్రబాబు, పవన్





నమో..జోష్

'సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్' పేరిట కర్నూలులో జరిగిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన విజయవంతమైంది. శ్రీశైలం మల్లికార్జున స్వామి, భ్రమరాంబికాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయన తిరిగి కర్నూలుకు చేరుకున్నారు. ప్రధానితో పాటు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ రావడంతో కూటమి శ్రేణులు భారీగా తరలివచ్చాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అభిమానులు, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలతో సభాప్రాంగణం నిండిపోయింది. ఓర్వకల్లు మండలం కర్నూలు-నంద్యాల జాతీయ రహదారి పక్కన నన్నూరు రాగమయూరి వెంచర్‌లో ఏర్పాటు చేసిన ప్రధాని సభకు దాదాపు 3 లక్షల మందికి పైగా ప్రజలు తరలివచ్చారు. వేలాది వాహనాల్లో తరలి రావడంతో కర్నూలు కిక్కిరిసిపోయింది. ఇక సభావేదిక వద్ద తెలుగుదేశం పార్టీ యువత కదనోత్సాహం... జనసైనికుల ఆనందం.. బీజేపీ శ్రేణుల కోలాహలం.. వెరసి ప్రధాని సభ సూపర్ సక్సెస్ అయింది.

- కర్నూలు (ఆంధ్రజ్యోతి)




సభలో ఉప్పొంగిన దేశభక్తి




సభలో టీడీపీ మహిళా నేతలు





శివాజీ స్ఫూర్తి కేంద్రంలో మోదీ





పొలాల వెంబడి పరుగులు





యానాం గోదావరిలో భారీగా లభ్యమైన చీరమేను, కొనుగోలు దారులతో కిక్కిరిసిన పుష్కర ఘాట్

చీరమేను... సందడి

- యానాం మార్కెట్‌లో శేరు రూ.1,500కు లభ్యం
- చౌక ధర అంటూ భారీగా తరలివచ్చిన కొనుగోలుదారులు
- మత్స్యకారులకు కాసుల వర్షం

యానాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో అంతర్భాగంగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో చీరమేను సందడి చేసింది. యానాం, గోదావరి జిల్లా వాసులు, మాంసాహారప్రియులు ఎంతో ఇష్టంగా తినే చేరమేను దీపావళి ముందు ఎక్కువగా దొరుకుతుంది. తూర్పు గాలుల సమయంలో నీటి అడుగు భాగం నుంచి ఉపరితలంపైకి చేరుకుంటాయి. యానాంలో గురువారం అధిక సంఖ్యలో చీరమేను దొరికి మత్స్యకారులకు కాసుల వర్షం కురిపించింది. ఉదయం నుంచి పెద్ద మొత్తంలో చీరమేను మార్కెట్‌కు



రావడంతో రాజీవ్‌గాంధీ బీచ్‌లోని పుష్కర ఘాట్ వద్ద సందడి వాతావరణం నెలకొంది. బకెట్, బిందెల్లో (ఒక్కో బకెట్ సుమారు 10 లీటర్లు) చీరమేను లభ్యమైనట్టు తెలిసింది. రెండు రోజుల క్రితం శేరు (ఒక లీటరు) రూ.2వేలకు పైగా అమ్మడైంది. ప్రస్తుతం శేరు రూ.1,500 నుంచి రూ.1,600 వరకు అమ్ముతున్నారు. చీరమేను చౌకగా దొరుకుతోందని తెలియడంతో మాంసాహారప్రియులు భారీగా వచ్చారు. కొందరు సేర్లు, మరికొందరు బకెట్‌లతో కొనుగోలు చేశారు. దీపావళి ముందు రోజుల్లో చీరమేను పడటం సహజం. అయితే గోదావరిలో తెల్ల నీరు (మురికిగా కాకుండా) తేలిపోవడంతో చీరమేను అధిక సంఖ్యలో లభ్యమవుతోందని స్థానిక మత్స్యకారులు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.

సత్యదీక్షలకు వేళాయె

నేటి నుంచి ప్రారంభం... వచ్చే నెల 13న విరమణ



సత్యదీక్షా ధారణలో భక్తులు (పాత చిత్రం)

అన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవునికి అత్యంత ఇష్టమైన సత్య దీక్షలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఆశ్వయుజ మాసంలో మఖ నక్షత్రం నాడు మొదలయ్యే దీక్షలు కార్తిక మాసంలో వచ్చే మఖ నక్షత్రంతో ముగుస్తాయి. వీటికి సంబంధించి దేవస్థానం యంత్రాంగం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసింది. గిరిజన ప్రాంతాలు, అన్నవరం పరిసర ప్రాంతాల్లో దీక్షలు తీసుకునే ఆసక్తి ఉన్న 1,500 మందికి దీక్షా వస్త్రాలు, దీక్షా మాలలు ఉచితంగా అందజేశారు. సత్య రథం ద్వారా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా గ్రామగ్రామాన ప్రచారం గావించారు. 27 రోజులు అత్యంత నియమనిష్టలతో దీక్ష ఆచరించాలి. 27 రోజులు దీక్ష కుదరని మహిళలు, ఇతరులు 18 రోజులు, 9 రోజులు దీక్ష స్వీకరించవచ్చు. దీక్ష ఎక్కడ తీసుకున్నా సత్యదేవుని సన్నిధిలోనే ఇరుముడి సమర్పించి విరమించాలి. 27 రోజుల దీక్షలు ఈ నెల 17న, 18 రోజుల దీక్ష ఈ నెల 26న, 9 రోజుల దీక్ష వచ్చే నెల 4న స్వీకరించాలి. దీక్ష ఎప్పుడు తీసుకున్నా నవంబరు 13న విరమించాల్సి ఉంటుంది. దీక్షా కాలంలో ఎంతో భక్తి శ్రద్ధలతో ఉండాలి. పసుపు రంగు దుస్తులు ధరించి మగవారిని సత్యదేవ, ఆడవారిని సత్యదేవిగా సంబోధించాలి. త్రికరణ శుద్ధిగా బ్రహ్మచర్యం పాటించాలి. ధూమపానం, మద్యపానం వదిలి మాంసాహారం భుజించకూడదు. నేలపైనే నిద్రించాలి. అబద్ధమాడరాదు. ఎంతో నియమనిష్టలతో ఆచరించడం ద్వారా ఆయురారోగ్యాలు కలిగి సుఖసంతోషాలతో ఉంటారని భక్తుల ప్రగాఢ విశ్వాసం.



శ్రీనివాసరావుకు పతకాలు, మెమెంటో అందజేస్తున్న నేషనల్ రిఫరీ లక్ష్మీదయానంద

ఆయన ఖాతాలో మరో నాలుగు

జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన ఆర్టీసీ డ్రైవర్ శ్రీనివాసరావు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో కాకినాడ ఆర్టీసీ డ్రైవర్ ఎం.శ్రీనివాసరావు నాలుగు బంగారు పతకాలు సాధించారు. నవంబరులో భూటాన్‌లో జరిగే అంతర్జాతీయ, జనవరిలో బెంగళూరులో జరిగే మాస్టర్స్ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఎంపికయ్యారు. ఇప్పటివరకు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో మొత్తం 91 పతకాలు సాధించిన శ్రీనివాసరావుకు పలువురు అభినందనలు తెలిపారు.



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి

'విద్యా రంగం అభివృద్ధికి ఎన్‌సీఈఆర్‌టీ కృషి'

సర్పవరం జంక్షన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది... అభివృద్ధి, సంక్షేమ పథకాలు, సంస్కరణలతో విద్యారంగం అభివృద్ధికి విశేష కృషి చేస్తోందని జాతీయ విద్యా పరిశోధన శిక్షణా సంస్థ (ఎన్‌సీఈఆర్‌టీ) డైరెక్టర్ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలంలోని ఏపీఎస్పీ జడ్పీ హైస్కూల్, హైస్కూల్ ప్లస్ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు పటిష్టమైన పనితీరు కనబర్చాలన్నారు. టెస్ట్, నోట్ పుస్తకాలను సమగ్రంగా పర్యవేక్షించాలని, విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్య బోధించాలన్నారు. పాఠ్య పుస్తకాల్లోని పలు అంశాలను వివిధ స్థాయిల్లో ఉన్న విద్యార్థులకు బోధించే పద్ధతి, మూల్యాంకనంపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయులు తరచూ పునశ్చరణ తరగతులు నిర్వహించుకుని బోధనా సామర్థ్యాలను మరింత పెంచుకోవాలని కోరారు. పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా పచ్చదనంతో ఉండడాన్ని గమనించి అందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. తరగతి గదుల్లోకి వెళ్లి పది, ఇంటర్ విద్యార్థులతో మాట్లాడి వారి విద్యా సామర్థ్యాలను పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న ఏపీఎస్పీ హైస్కూల్ ప్లస్ ప్రధానోపాధ్యాయురాలు కె.గాయత్రిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎన్‌సీఈఆర్‌టీ రైటర్ రమేష్, డీవైఈవో కేవీవీ సత్యనారాయణ, డీసీఈబీ సెక్రటరీ వెంకట్రావు, పాఠశాల ఇన్‌చార్జి శ్రీనివాస్, ఉపాధ్యాయులు చామంతి నాగేశ్వరరావు, కందుకూరి పాల్‌రాజు, ఉద్దగిరి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

50 అత్తాలు... 850 కాయలు

కర్పూర రకానికి చెందిన ఒక అరటి చెట్టు ఏకంగా 50 అత్తాలతో అబ్బురపరుస్తోంది. కాకినాడ జిల్లా కరపలో టీడీపీ మండల అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు ఇంటి పెరట్లోని అరటి చెట్టుకు 50 అత్తాలుండగా ఒక్కో అత్తానికి 15 నుంచి 17వరకు కాయలున్నాయి. దాదాపు 850 కాయలున్నాయని ఆయన కుమారుడు వీరేష్ లెక్కకట్టి చెప్పాడు.

- కరప (ఆంధ్రజ్యోతి)





బాలబాలాజీస్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజన సేవ నిర్వహిస్తున్న అర్చకులు

కనుల పండువగా స్నపన తిరుమంజనం

అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో రెండో రోజుకు పవిత్రోత్సవాలు

మామిడికుదురు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో పవిత్రోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. గురువారం స్నపన తిరుమంజన సేవ కనుల పండువగా జరిగింది. చతుస్థానార్చనలతో ప్రారంభమైన ఉత్సవాల్లో అగ్ని ప్రతిష్ఠాపన, పవిత్రారోహణ పూజలనుశాస్త్రోక్తంగా నిర్వహించారు. 27 కలశల్లో తీసుకువచ్చిన పంచామృతాలు, 11 రకాల పండ్ల రసాలు, సుగంధ ద్రవ్యాలు, ఉద్ధ జలాలతో బాలబాలాజీ స్వామితో పాటు పద్మావతీదేవి, ఆండాళ్‌తాయార్‌లకు తిరుమంజనం జరిపారు. అనంతరం ప్రాయశ్చిత హోమం, నివేదన, తీర్థ ప్రసాదగోష్ఠి, చతుస్థానార్చనలు, మంగళాశాసనం జరిపారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తుల మనసులను రంజింపచేశాయి. శ్రీమాన్ త్రిదండి శ్రీమన్నారాయణ రామనుజ చినజీయర్ స్వామిజీ శిష్య బృందం, గుడివాడకు చెందిన చలమచర్ల మురళీకృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ఆలయ సహాయ కమిషనరు ఎం.సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. అధిక సంఖ్యలో భక్తులు వీక్షించి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గోదావరి జిల్లాల గొప్పతనాన్ని చెప్పేందుకే

ఆహార పదార్థాల ప్రదర్శన

- నన్నయ వీసీ ప్రసన్నశ్రీ
- ముగిసిన ఆహార మహోత్సవ్



విజేతలకు బహుమతులను అందజేస్తున్న వీసీ ప్రసన్నశ్రీ, రిజిస్ట్రార్ స్వామి

దివాన్‌చెరువు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సైన్స్, టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో మూడురోజులపాటు జరిగిన ఆహార మహోత్సవ్ కార్యక్రమం గురువారంతో ముగిసింది. మూడోరోజైన గురువారం విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో పశ్చిమగోదావరిజిల్లా ఫుడ్‌స్టాల్ ప్రదర్శన కార్యక్రమం జరిగింది. నన్నయ అనుబంధ కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు హాజరై 84 స్టాల్స్‌లో తమ ఆహారపదార్థాలను ప్రదర్శించారు. పండుగ వాతావరణంలో జరిగిన ఈకార్యక్రమాన్ని విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు ఆశక్తిగా తిలకించారు. ఈసందర్భంగా వీసీ ప్రసన్నశ్రీ మాట్లాడుతూ ఆరోగ్యకరకరమైన అలవాట్లను, వంటకాలను ఆరోగ్యకరమైన జీవితాన్ని గోదావరిజిల్లా గొప్పతనాన్ని తెలియజేసే ప్రయత్నమే ఈకార్యక్రమం లక్ష్యం అని అన్నారు. తమ లక్ష్యం నెరవేరిందని చెప్పారు. అనంతరం శాఖాహార, మాంసాహార విభాగాలలో విజేతలైన వారికి వీసీ ప్రసన్నశ్రీ, విశ్వవిద్యాలయ అధికారులు, న్యాయనిర్ణేతలు బహుమతులను అందజేశారు. రెండురోజుల ఆహార మహోత్సవ్‌లో స్టాల్స్‌ను ఏర్పాటుచేసిన వారికి ప్రసంశాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.వి.స్వామి, ప్రిన్సిపాల్‌లు పి.విజయనిర్మల, పి.వెంకటేశ్వరరావు, విభాగాధిపతి డి.కళ్యాణి, అధ్యాపకులు టి.హైమావతి, బి.ఉషశ్రీ, శాంతరాజ్యం, ఎం.ఎం.కృష్ణవేణి,టి.సింధూజ పాల్గొన్నారు.

విజేతలు వీరే

● శాఖాహారవంటకాలలో మొదటిస్థానం సున్నుండలు, కారప్పూస చేసిన హయగ్రీవ బీఈడీ కళాశాల చింతలపూడి డి.కీర్తి, చల్లా స్వర్ణలత, రెండో స్థానం కొబ్బరిపాలతో వంకాయపచ్చడి చేసిన విశ్వవిద్యాలయం మెకానికల్ విద్యార్థి జి.ఆదర్శ్, మూడోస్థానం గోంగూర బిర్యానీ, సొరకాయ హల్వా, లచ్చించారు, ఉలవచారు చేసిన బి.వి.రాజు కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. ప్రోత్సాహక బహుమతులను ఎస్.కె.సుల్తానా, కె.అమృత, డాక్టర్ ఉమామణి, ఎం.హర్షితనాగశ్రీ, దేవలాల్ అందుకున్నారు.

●మాంసాహార వంటకాలలో మొదటిస్థానం ఎండుచేపకూర చేసిన విశ్వవిద్యాలయం బాలికల వసతిగృహం విద్యార్థులు, రెండోస్థానం చికెన్ ఫ్రైడ్‌రైస్ చేసిన నన్నయ విశ్వవిద్యాలయం కుమారి, మూడోస్థానం కుండలో కోడికూర, చద్దెన్నంకు ఫిజిక్స్ విభాగం నుంచి క్రాంతి అందుకున్నారు. ప్రోత్సాహక బహుమతులు నన్నయ విశ్వవిద్యాలయం ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం నుంచి జి.చంద్రకళ, తాడేపల్లిగూడెం ప్రాంగణం నుంచి ఎస్.ఉషారామ్, బీఈడీ విద్యార్థి జి.రమ్యా, ఎంబీఏ విద్యార్థి వి.సాహితీలు అందుకున్నారు.

రూ.కోటి స్కామ్ జరిగినా పట్టదా!

- బ్యాంకు అధికారుల తీరుపై డ్వాక్రా సభ్యుల నిరసన
- వేళంగి ఎస్‌బీఐ బ్రాంచిని ముట్టడించిన మహిళలు, గ్రామస్థులు


వేళంగి స్టేట్ బ్యాంక్ ఎదుట ఆందోళన చేస్తున్న కూరాడ డ్వాక్రా సభ్యులు, గ్రామస్థులు

కరప, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కోటి రూపాయల స్కామ్ జరిగినా మిన్నకుండిపోయిన బ్యాంకు అధికారుల తీరును నిరసిస్తూ కాకినాడజిల్లా కరప మండలం కూరాడ గ్రామానికి చెందిన పలువురు బాధిత డ్వాక్రా సభ్యులు గురువారం వేళంగి స్టేట్‌బ్యాంక్‌ను ముట్టడించారు. ప్రధానద్వారం ఎదుట బైఠాయించి ఉద్యోగులను లోపలకు వెళ్లకుండా అడ్డుకున్నారు. కడుపు కట్టుకుని నెలవారీ రుణ వాయిదాలను చెల్లిస్తే బ్యాంకులో జమచేయకుండా నొక్కేసిన బీసీ పాయింట్ కరస్పాండెంట్ చిన్నం ప్రియభారతి, ఆమెకు సహకరించిన యానిమేటర్లపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కనెల వాయిదా కట్టకపోయినా ఉపేక్షించని బ్యాంకు అధికారులు ఏళ్ల తరబడి 85 సంఘాలకు చెందిన దాదాపు రూ.99లక్షలు పక్కదారి పట్టినా పట్టించుకోకపోవడంపై బాధితులు అనుమానం వ్యక్తం చేశారు. జరిగిన అవకతవకలు, అక్రమాల్లో వారి ప్రమేయం కూడా ఉందని ఆరోపించారు. పొదుపు సొమ్ములను వాయిదాలకు జమవేసుకోవడంపైనా బాధితులు తీవ్రంగా స్పందించారు. జిల్లా ఉన్నతాధికారులు, ఎస్‌బీఐ అధికారులు స్పందించి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. బాధిత మహిళా సంఘాల సభ్యులకు సంఘీభావంగా గ్రామస్థులు కూడా బ్యాంకు ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వచ్చి ఆందోళనకారులు, బ్యాంకు సిబ్బందితో చర్చించారు. బ్రాంచి మేనేజర్ వచ్చి తమకు స్పష్టమైన హామీ ఇస్తేనేగానీ కదిలేది లేదని బాధితులు భీష్మించుకుని కూర్చున్నారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో ఏబీఎం ఫల్గుణరావు బాధితులతో చర్చించారు. ఉన్నతాధికారులకు నివేదించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించి ఆయనకు ఫిర్యాదు పత్రాలను అందించి అక్కడి నుంచి వెనుదిరిగారు. ఆందోళనలో ఎంపీటీసీ గుత్తుల శాంతిబాలాజీ, జేఎస్పీ నాయకుడు వెలుగుబంట్ల గంగాధర్, వైసీపీ నాయకుడు వెలుగుబంట్ల నారయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాఘవాపురంలో

గ్రావెల్ తవ్వకాలు

- పరిశీలించిన మైన్స్ అధికారులు
- సీజ్ చేసిన చైన్ మౌంటెడ్ యంత్రం


అక్రమ తవ్వకాలను పరిశీలించిన మైనింగ్ అధికారులు


మైనింగ్ అధికారులు సీజ్ చేసిన చైన్ మౌంటెడ్ యంత్రం

కోరుకొండ, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం రాఘవాపురం గ్రామ పరిధిలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్న సమాచారంపై జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారులు ఆకస్మిక తనిఖీ చేసినట్లు జిల్లా మైన్స్‌అధికారి డి.ఫణి భూషణ్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తనిఖీ సమయంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్న గుంతలు, తవ్వకాలకు ఉపయోగించిన టాటా హిటాచి (చైన్ మౌంటెడ్ పాన్) యంత్రాన్ని గుర్తించారు. అక్కడ ఉన్న ఆపరేటర్ మురమల్ల ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత ప్రదేశానికి ఎటువంటి శాఖాపరమైన అనుమతులు లేవని నిర్ధారించడంతో, ఇది అక్రమ తవ్వకంగా గుర్తించారు. అనంతరం సర్వే నెం.44/2,44/3లోని ప్రాంతంలో తవ్వకాలు జరిగినట్లు గుర్తించి కొలతలు వేయగా, మొత్తం 19,300క్యూబిక్ మీటర్ల గ్రావెల్ అక్రమంగా తవ్వినట్లు తేలింది. ఆ భూమి వంక బరాజు వెంకట సర్వేశ్వరరావు, వంక వరలక్ష్మీ, గునమూరి ఆనందలక్ష్మి, వంక సూర్య కుమారిలకు చెందిందని రాఘవాపురం గ్రామ రెవెన్యూ అధికారులు తెలిపారు. అక్రమ తవ్వకాలకు ఉపయోగించిన టాటా హిటాచి యంత్రాన్ని స్థానిక రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో రాఘవాపురంలో భద్రపరిచారు. అనుమతి లేని ప్రాంతాలలో తవ్వకాలు నిర్వహించినట్లయితే సంబంధితులపై గనులు, భూగర్భశాఖచే కఠినచర్యలు తీసుకుంటా మని జిల్లా గనులు, భూగర్భశాఖ అధికారి హెచ్చరించారు. కేవలం అనుమతి పొందిన గనులలోనే తవ్వకాలు, రవాణా నిర్వహించాల్సిందిగా సూచించారు.

అనుమానంతో భర్త, అత్త వేధింపులు

- వివాహిత ఆత్మహత్య
- నువ్వంటే నిజంగా చాలా ఇష్టం అంటూ లేఖ


మృతదేహాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్, ఎస్‌ఐ

తొండంగి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తొండంగి మండలం గోపాలపట్నంలో భర్త వేధింపులు, అత్త సూటిపోటీ మాటలు భరించలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళంజిల్లా పాతపట్నం మండలం తిడ్డిమి గ్రామానికి చెందిన గొర్లి బుద్దుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా మలికిపురం మండలం లక్కవరం గ్రామంలో నివాసముంటున్నారు. ఈయన కుమార్తె శిరీష బీకాం కంప్యూటర్స్ చదివింది. ఈమెకు గత మేనెల 15న పాతపట్నం గ్రామానికి చెందిన ఏనుగుతల ప్రదీప్‌కుమార్‌తో వివాహం జరిగింది. ప్రదీప్ తొండంగి మండలంలోని దివీస్ ఫార్మా కంపెనీలో పనిచేస్తుండగా భార్యాభర్తలతో గోపాలపట్నంలో ఆగస్టు నెలలో కాపురం పెట్టించారు. వీరింటికి తరచూ ప్రదీప్ తల్లి ఏనుగుతల నాగమ్మ వచ్చి వెళ్తూ ఉండేది. తల్లి మాటలు విని ప్రదీప్ తన భార్యను తరచూ వేదించేవాడు. ఫోనులో శిరీష ఎవరితోనో ఛాటింగ్ చేస్తోందన్న అనుమానంతో తరచూ వేధింపులకు గురిచేస్తుండేవాడు. అనుమానంతో భర్త కొడుతున్నాడని, వేధింపులు భరించలేకపోతున్నానని తల్లిదండ్రులకు ఆమె ఫోన్‌చేసి చెప్పి ఏడ్చేది. బుధవారం కూడా తల్లిదండ్రులకు వేధింపులు భరించలేకపోతున్నానని ఫోన్ చేసి చెప్పింది. వాళ్లు మళ్లీ ఫోన్ చేయగా తీయడంలేదు. దీంతో అనుమానం వచ్చి వారు గోపాలపట్నం బయలుదేరి వచ్చారు. అప్పటికే శిరీష చున్నీతో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని చనిపోయి ఉంది. ఆమె రాసిన సూసైడ్ నోట్‌లో తన మృతికి తన అత్త నాగమ్మ, భర్త ప్రదీప్‌లే కారణమని ఉంది. తనకు, భర్త అనుమానిస్తున్న వ్యక్తికి ఎటువంటి సంబంధంలేదని, భర్త పెడుతున్న వేధింపులు భరించడం తనవల్ల కావడం లేదని లేఖలో పేర్కొంది. ఎటువంటి గొడవలు పడకండి, నువ్వు మంచిగా ఉండు.. నువ్వంటే చాలాఇష్టం.. మిస్ యు ప్రదీప్ అంటూ ముగించింది. దీనిపై మృతురాలి తండ్రి బుద్ధుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తొండంగి ఎస్‌ఐ జగన్మోహన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. తహశీల్దార్ కాంతారావు సంఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు.

ద.మ.రైల్వే పీసీఎండీ హెల్త్ యూనిట్ తనిఖీ


హెల్త్ యూనిట్‌ని పరిశీలిస్తున్న పీసీఎండీ డాక్టర్ నిర్మలా రాజారామ్

రాజమహేంద్రవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ నిర్మలా రాజారామ్ గురువారం రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేశారు. కాకినాడ నుంచి మధ్యాహ్నం చేరుకొని రైల్వే హెల్త్ యూనిట్, యాక్సిడెంట్ రిలీఫ్ మెడికల్ వ్యాన్(ఏఆర్‌ఎంవీ)ని పరిశీలించారు. హెల్త్ యూనిట్‌లోని ఫార్మసీ, ల్యాబ్, రిజిస్టర్లు చూశారు. రోగులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. ఏఆర్‌ఎంవీలోని అత్యవసర వైద్యఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం తిరిగి కాకినాడ వెళ్లారు. కార్యక్రమంలో సీఎండీ డాక్టర్ ఏవీఎస్‌కే ప్రసాద్, సీనియర్ డీఎంవో డాక్టర్ సునీల్ కుమార్, డీఎంవో డాక్టర్ వెంకమాంబ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణం పోశారు..

- గోకవరం ప్రభుత్వాసుపత్రిలో ఘటన


గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేస్తున్న వైద్యాధికారి రామలక్ష్మి

గోకవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గోకవరం ప్రభుత్వాసుపత్రిలో గురువారం ఓ అరుదైన సంఘటన చోటుచేసుకొంది. ప్రభుత్వాసుపత్రిలో ఈనెల 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు సీపీఆర్ అవగాహన కార్యక్రమం నిర్వహించాలంటూ ప్రభుత్వం నిర్ణయించింది. దీనిలోభాగంగా స్థానిక ప్రభుత్వాసుపత్రిలో సీపీఆర్‌పై పోస్టర్స్ ద్వారా ప్రజలకు ఆసుపత్రి ప్రధాన వైద్యాధికారిణి రామలక్ష్మి, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఈక్రమంలో ఏజెన్సీ ప్రాంతంలోని పాతరామవరం గ్రామానికి చెందిన కె.వెంకట రమణ అనే వ్యక్తి పాము కాటుకు గురై, గుండె పోటురావడంతో ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లాడు. దీంతో కటుంబ సభ్యులు హుటాహుటినా స్థానిక ప్రభుత్వాసుపత్రికి తీసికొచ్చారు. ఇంతలో సీపీఆర్‌పై డెమో రూపంలో వివరిస్తున్న వైద్యాధికారిణి రామలక్ష్మికి విషయం తెలిసి వెంటనే బాధితుడువద్దకు పరుగులు తీశారు. వెంటనే వైద్యురాలు రామలక్ష్మి, వైద్య సిబ్బంది సుమారు 6 నుంచి 10నిమిషాలపాటు వెంకటరమణకు సీపీఆర్ చేసి ప్రాణాపాయస్థితి నుంచి అతనిని గట్టెక్కించారు. తరువాత కొద్దిసేపటికి బాధితుడికి వైద్య పరీక్షలు నిర్వహించగా అతని ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉన్నట్లు ఆమె గుర్తించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగానే ఉందని, ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నట్లు సిబ్బంది తెలిపారు. గుండెపోటుకు గురైన వ్యక్తులను ఏ విధంగా రక్షించుకోవాలో తెలిపేందుకు ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీపీఆర్ కార్యక్రమం ఓ నిండు ప్రాణాన్ని కాపాడటంపట్ల వైద్యాధికారిణి రామలక్ష్మి, సిబ్బంది అభినందించారు.

బంగారు ఆభరణాలు స్వాధీనం


అమలాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

అమలాపురం టౌన్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అమలాపురం బస్టాండులో బస్సు ఎక్కుతున్న సమయంలో ఆభరణాలతో ఉన్న బ్యాగును పోగొట్టుకున్న మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్‌ఐ ఎన్ఆర్ కిశోర్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ నేతృత్వంలో క్రైమ్ సిబ్బంది సహకారంతో కేసును ఛేదించారు. పశ్చిమ గోదావరిజిల్లా భీమవరానికి చెందిన జడ్డు ముత్యవతి (61) అనే మహిళను అరెస్టుచేసి ఆమె వద్ద నుంచి 66.270 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ గురువారం వెల్లడించారు. ఇమ్మిడివరప్పాడుకి చెందిన వెలిగంటి లీలావతి ఈనెల 4వ తేదీన బస్సు ఎక్కేందుకు అమలాపురం డిపోకు రాగా బంగారు ఆభరణాలతో ఉన్న బ్యాగును పోగొట్టుకుంది. అందులో నల్లపూసల దండ, నక్లెస్‌తో పాటు వివిధ రకాల ఆభరణాలు ఉన్నాయి. దీంతో లీలావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

యువతి కిడ్నాప్ కేసులో ముగ్గురి అరెస్టు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లాకు చెందిన యువతి కిడ్నాప్ కేసులో ముగ్గురిని గొల్లప్రోలు పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ జీ.శ్రీనివాస్ గురువారం రాత్రి వెల్లడించారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం శ్రీరాంపురం గ్రామానికి చెందిన ఓ యువతి కర్రి వంశీతోపాటు ఓ మైనర్‌ను ప్రేమించింది. దీనిపై వీరి మధ్య వివాదం జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 11వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో బాలుడు సదరు యువతిని స్కూటర్ ఎక్కించుకుని రాజానగరం బీచ్ వద్దకు తీసుకువెళ్లాడు. అక్కడ నుంచి మైనర్ బాలుడు, వంశీ, వంశీ స్నేహితుడు రాజు ఆమెను బలవంతంగా కారులో ఎక్కించుకుని అన్నవరం, కత్తిపూడి మీదుగా గొల్లప్రోలు మండలం చేబ్రోలు శివారులోని మట్టిరోడ్డులోకి తీసుకువెళ్లారు. కాగా, ఇద్దరిలో ఎవరో ఒకరిని తేల్చుకోవాలంటూ యువతిని వారు కొట్టి బెదిరించారు. అక్కడ చేబ్రోలుకి చెందిన వాడబోయిన సాంబశివ అలియాస్ సాంబ అనే వ్యక్తి యువతిని బెదిరించాడు. దీంతో యువతి ఫిర్యాదు మేరకు గొల్లప్రోలు ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం మైనర్ బాలుడు, కర్రి వంశీ, రాజును చేబ్రోలు కోకోపామ్ వద్ద గురువారం అరెస్టు చేశారు. నేరానికి ఉపయోగించిన కారును స్వాధీన పర్చుకున్నారు. మరో ముద్దాయి సాంబ పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

జడ్.మేడపాడులో రైల్వేగేటును ఢీకొట్టిన క్వారీ లారీ

మండపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండపేట మండలం జెడ్.మేపాడులో రైల్వేగేటును గురువారం ద్వారపూడి వైపు నుంచి వచ్చిన క్వారీ లారీ వేగంగా ఢీకొట్టింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దానివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ సంఘటనపై రైల్వే అధికారులు లారీ యాజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గేటు మరమ్మతులు చేస్తే గానీ గేటు తెరుచుకోదని అధికారులు తెలిపారు.

తహశీల్దార్ ఇంట్లో ఏసీబీ అధికారుల సోదాలు

- ల్యాప్‌టాప్‌తో సహా కీలక డాక్యుమెంట్లు స్వాధీనం

అమలాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): లంచం తీసుకుంటూ పట్టుబడ్డ అమలాపురం తహశీల్దార్ పలివెల అశోక్‌ప్రసాద్ ఇంట్లో బుధవారం అర్ధరాత్రి దాటే వరకు ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో గంధం దుర్గాకొండలరావు నుంచి భూమి సర్వే నిమిత్తం రూ.50 వేలు లంచం తీసుకుంటూ తహశీల్దార్‌తో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ రాము ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఈ నేపథ్యంలో రెవెన్యూఉన్నతాధికారి ఒకరిని ఏసీబీ అధికారులు విచారించినట్టు సమాచారం. తహశీల్దార్ నివాసం ఉంటున్న అమలాపురం కామనగురువు రోడ్డులో ఉన్న ఆయన ఇంట్లో తనిఖీలు నిర్వహించారు. సుమారు 25 మందికిపైగా ఏసీబీ అధికారులు బృందాల వారీగా విడిపోయి అమలాపురంలో బుధవారం మకాం వేసినట్టు తెలిసింది. కీలకమైన ల్యాప్‌టాప్‌తో పాటు ఇతర ఆధారాలు లభ్యం కావడమే కాకుండా ఆయన ఒక విలాసవంతమైన ఇల్లు నిర్మిస్తున్నట్టు గుర్తించారు. కాగా, తహశీల్దార్‌ను అక్రమంగా ఏసీబీ కేసులో ఇరికించారంటూ కొందరు సోషల్ మీడియా వేదికగా ప్రచారాలు చేస్తున్నట్టు సమాచారం. విచారణ అనంతరం గురువారం తెల్లవారుజామున తహశీల్దార్ అశోక్‌ప్రసాద్, డేటాఎంట్రీ ఆపరేటర్ రాములను ఏసీబీ కోర్టులో హాజరు పరిచేందుకు అధికారులు తరలించారు.

యువతి అదృశ్యంపై కేసు

పి.గన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై గురువారం పి.గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం చల్లపల్లికి చెందిన ఓ యువతి ఈనెల 14న పి.గన్నవరం మండలంలోని ఒక గ్రామంలో ఉన్న తన అక్క ఇంటికి వచ్చింది. తన బావ ఊరు వెళ్లడంతో అక్కకు తోడుగా ఉండేందుకు వచ్చిన యువతి గురువారం ఉదయం నుంచి అదృశ్యమైంది. ఉదయం ఐదుగంటల సమయంలో చెల్లి లేకపోవడాన్ని గమనించిన అక్క బంధువులకు సమాచారం అందించింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వాకబు చేసినా ఎంతకీ ఫలితం లేకపోవడంతో సదరు యువతి బంధువులు ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ బీ.శివకృష్ణ తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

ఆభరణాల చోరీపై కేసు నమోదు

పి.గన్నవరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం హైస్కూల్ రోడ్డులో బంగారం, వెండి ఆభరణాలు అపహరణకు గురికావడంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి .... పి.గన్నవరం గ్రామానికి చెందిన ఏడిద వీరవెంకటలక్ష్మి కుటుంబం కొంతకాలంగా ఉపాధి నిమిత్తం హైదరాబాదులో కూరగాయలు షాపు నిర్వహించుకుంటున్నారు. హైస్కూల్ రోడ్డులో ఉన్న ఇంట్లో ఒక పోర్షన్‌ను అద్దెకు ఇవ్వగా, వారు నివసించే పోర్షన్‌కు తాళం వేసుకున్నారు. ఈక్రమంలో ఆగస్టు 24 వ తేదీన వీరవెంకటలక్ష్మి కుటుంబం పెళ్లి నిమిత్తం స్వగ్రామానికి వచ్చి తిరిగి పయనమయ్యారు. కాగా, ఈనెల 9వ తేదీన ఇంటి తాళాలు పగలుగొట్టి ఉండటాన్ని గమనించిన స్థానికులు వారికి సమాచారం అందించారు. దీంతో హైదరాబాద్ నుంచి వచ్చి ఇంటిని పరిశీలించగా 16 గ్రాముల బంగారం ఆభరణాలు, 15 తులాలు వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్టు గుర్తించారు. దీంతో వీరవెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు.

తండ్రీ, కొడుకుల

ఆత్మహత్మ కేసులో ముగ్గురిపై కేసు

ఆలమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం మడికి శివారు చిలకలపాడులో బుధవారం జరిగిన ఆత్మహత్యలకు సంబంధించి ముగ్గురిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. పావులూరి కామరాజు తన కుమారులైన అభిరామ్, గౌతమ్‌ను హతమార్చి తాను కూడా ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే.దీంతో చిలకలపాడుకు చెందిన పాలువూరి దుర్గారావు, కొలప్రోలు తలుపులు, కొల్ర పోలు శ్రీనివాస్ వేధింపులు భరించలేకే తాను తన కుమారులు చనిపోతున్నట్టు ఆత్మహత్యకు ముందు కామరాజు సెల్ఫీ వీడియో తీశాడు. ఈ మేరకు వారి ముగ్గురిపై 306 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్టు ఆలమూరు ఎస్‌ఐ జీ.నరేష్ తెలిపారు.

పోస్టుమార్టం పూర్తి..

గురువారం మూడు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తిచేశారు. అనంతరం బంధువులకు అప్పగించారు. బుధవారం సాయంత్రానికి ఎఫ్ఎస్ఎల్ టీమ్‌లు రావడం ఆలస్యమైంది.

లారీ ఢీకొని ఒకరి మృతి

- మండపేట మండలం జెడ్.మేడపాడు వద్ద ప్రమాదం


మృతిచెందిన వెంకటేష్

మండపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండపేట మండలం జెడ్.మేడపాడు వద్ద గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో మోటారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి లారీని తప్పించబోయి ఎదురుగా వస్తున్న మరో లారీ ఢీకొట్టడంతో మృతిచెందాడు. మండపేట రూరల్ పోలీసుల కథనం ప్రకారం ఇప్పనపాడుకు చెందిన సిద్దాంతపు వెంకటేష్ (35)గా గుర్తించారు. మృతుడుకి భార్య, కుమారుడు వున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు మండపేట రూరల్ ట్రైని ఎస్‌ఐ సోమేంద్ర తెలిపారు.

తాండవ నదిలో స్నానానికి దిగి ..


నీటిలో తేలియాడుతున్న పెద్దింట్ల మృతదేహం

కోటనందూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): తాండవ నదిలో స్నానానికి దిగి వ్యక్తి మృతిచెందాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అల్లిపూడి గ్రామానికి చెందిన వడ్లమూరి పెద్దింట్ల అనే శ్రీను కూలీ పని చేసుకుని జీవిస్తున్నారు. బుధవారం యథావిధిగా పని నుంచి ఇంటికి వచ్చే సమయంలో తాండవ నదిలో స్నానానికి దిగి కనిపించలేదు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు, పోలీసులు, ఫైర్ సిబ్బంది ఎంత వెతికినా కనిపించలేదు. గురువారం ఉదయం నదిలో శవమై కనిపించాడు. భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతుడిని పోస్టుమార్టం నిమిత్తం తుని ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

నేడు బాణసంచా పేలుడు ప్రదేశానికి విచారణ బృందం రాక

మండపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఈనెల 8న రాయవరంలో జరిగిన బాణసంచాపేలుడు సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విచారణ అధికారులు బృందం శుక్రవారం ఆప్రదేశానికి రానుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు విచారణ అధికారులుగా మున్సిపల్‌శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి సురేష్‌కుమార్, ఈగల్ ఐజీ ఆర్.హరికృష్ణను నియమించారు. ఈ బృందం వచ్చిన తర్వాత విచారణ జరిపి తమ నివేదికను రాష్ట్రప్రభుత్వానికి సమర్పించనుందికాగా, మృతిచెందిన వారంతా రెక్కాడితే గానీ డొక్కాడనివారే నని, వారికి ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా అందజేసి మృతులకుటుంబాలను ఆదుకోవాలని మృతుల కుటుంబాలకు చెందినవారితో పాటు ప్రజాసంఘాలు ప్రభుత్వాన్ని కోరుతున్నాయి.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

- సూర్యారావుపేటలో ఘటన

రాజానగరం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): భార్య, భర్త మధ్య తలెత్తిన వివాదం కారణంగా వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. రాజానగరం గ్రామ పంచాయతీ పరిధి సూర్యారావుపేటకు చెందిన నాగరాజు శ్రీజ్యోతి (25) అనే వివాహిత, భర్త కృష్ణ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీజ్యోతి తల్లి దుబాయ్‌లో ఉంటూ అప్పుడప్పుడు కూతురికి కొంత డబ్బులు పంపిస్తుంటుంది. వీటిని మృతురాలి భర్త వృథాగా ఖర్చు చేస్తుంటాడు. ఈ విషయమై భార్యభర్త మధ్య మాటామాటా పెరిగి గొడవలు పడ్డారు. దీంతో తీవ్ర మనస్థాపం చెందిన శ్రీజ్యోతి గురువారం చీరతో ఇంట్లోని సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలికి ఏడాదిన్నర, ఎనిమిది నెలలు వయసు కలిగిన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ మేరకు రాజానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.

రైళ్లలో దీపావళి సామగ్రి రవాణా చేస్తే జైలు

- దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక ఉత్తర్వులు జారీ

సామర్లకోట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళి నేపథ్యంలో రైళ్లలో నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా సామగ్రి రవాణా చేసే వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలని రైల్వేశాఖ ఆదేశాలు జారీ చేసింది. కాకినాడ జిల్లాలోని సామర్లకోట రైల్వేస్టేషన్ పరిధిలో బాణసంచా తయారీ సంస్థలు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి అనధికారికంగా బాణసంచా సామాగ్రిని వివిధప్రాంతాలకు రవాణా చేస్తున్నారనే ఆరోపణలు అనేకం ఉన్నాయి. దీంతో దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది. బాణసంచా, పేలుడు పదార్థాలను రైళ్లలో తీసుకెళ్లకుండా చూడాలని సామర్లకోట రైల్వే అధికారులను హెచ్చరించింది. ఒకవేళ ప్రయాణికులు బాణసంచాతో పట్టుబడితే రూ. వెయ్యి జరిమానా (లేదా) మూడునెలల జైలు విధిస్తామని రైల్వే ఉన్నతాధికారులు జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొన్నారు.

అమలాపురం

డిగ్రీ కళాశాలకు బీరువాలు బహూకరణ

అమలాపురంరూరల్,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు గురువారం దాతలు బీరువాలను అందించారు.కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసిన ఎం.రామమూర్తి, ఈదరపల్లికిచెందిన విశ్రాంత రైల్వే ఉద్యోగి సరెళ్ల నాగభూషణం, దామిశెట్టి స్వామినాయుడు జ్ఞాపకార్థం వారి కుమార్తెలు బీరువాలు అందజేశారు.

పోషకాహారం తీసుకోవాలి

ముమ్మిడివరం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): పోషకాహారాన్ని తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని ముమ్మిడివరం సీడీపీవో ఎం.నిహారిక అన్నారు.ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం జరిగిన సదస్సులో నిహారిక మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు 42రకాల పిండి వంటలను ప్రదర్శించారు.

జీఎస్టీ 2.0తో రవాణా, లాజిస్టిక్ రంగాలకు ఎంతో లబ్ధి

- ఎమ్మెల్యే ఆనందరావు
- పలు చోట్ల అవగాహన ర్యాలీలు



అమలాపురంలో వాహనాల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

అమలాపురంటౌన్, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0తో రవాణా, లాజిస్టిక్ రంగాలకు ప్రభుత్వం సూపర్‌గిఫ్ట్‌లను ఇచ్చిందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. జిల్లా రవాణాశాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గురువారం స్థానిక రవాణాశాఖ కార్యాలయం వద్ద జీఎస్టీ తగ్గింపుపై ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం జీఎస్టీ రాయితీతో కొనుగోలు చేసిన వాహనాల ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కె.రవికుమార్, జె.సురేష్‌కుమార్, ఏఎంవీఐ డి.కౌశిక్, లారీ యూనియన్ ప్రతినిధులు, ఆటోయూనియన్ ఉపాధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ ద్వారా సామాన్య ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురంలో రవాణాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కేతా వెంకటలక్ష్మి, మాలే శ్రీనివాసనగేష్, మంగెన భూదేవి, బందెల పద్మ, జక్కంపూడి శ్రీదేవి, గెడ్డం మహలక్ష్మిప్రసాద్, గుబ్బల ఫణి, జి.రవికిరణ్, రవాణాశాఖాధికారి షణ్ముక్ పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): రవాణా,లాజిస్టిక్ రంగాలను బలోపేతం చేసేలా కేంద్రం జీఎస్టీ తగ్గింపు నిర్ణయాలను తీసుకుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. గురువారం అంబాజీపేట బస్టాండ్ వద్ద జీఎస్టీ2.0పై జిల్లా రవాణాశాఖాధికారి డి.శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆటో, క్యాబ్, వ్యాన్ల ర్యాలీని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టపర్తి భారతి, సర్పంచ్‌లు జల్లి బాలరాజు, పేరాబత్తుల దొరబాబు, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనరు బి.వెంకటేశ్వరరావు, డీసీటీవో గంగాభవాని, ఏసీటీవో సత్యనారాయణ, ఎంవీఐలు కె.ఆర్.రవికుమార్, సురేష్ కుమార్, ఏఎంవీఐ డి.కౌశిక్, ఎంపీడీవో మమత తదితరులు పాల్గొన్నారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణల ఫలితాలు ప్రతి ఒక్కరికీ చేరాలని జిల్లా రవాణాశాఖాధికారి కౌశిక్ అన్నారు. మురమళ్ళలో గురువారం జరిగిన నెట్‌ఫ్లిక్స్ అవగాహన సదస్సులో జీఎస్టీ సంస్కరణలపై ప్రజలకు అవగాహన కల్పించారు. తొలుత టీడీపీ మండలాధ్యక్షుడు సాగిరాజు సూరిబాబురాజు జీఎస్టీ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో దాట్ల పృథ్వీరాజు, అర్థాని శ్రీనివాసరావు, జంపన బాబు, నిమ్మితి చిరంజీవి, పెసంగి ధర్మారావు, అధిక సంఖ్యలో కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో హార్బరుకు మెరుగులు: ఎమ్మెల్యే దేవ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

అంతర్వేది, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అంతర్వేది పల్లిపాలెంలో గత టీడీపీ ప్రభుత్వంలో కోట్ల నిధులతో నిర్మించిన మినీ ఫిషింగ్ హార్బరు మళ్లీ తిరిగి కూటమి ప్రభుత్వంతో తుది మెరుగులు దిద్దుకుంటుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీని ఏర్పాటుచేసి ఆర్‌ఆర్ నిర్వహణ టెండరు దక్కించుకోవడంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గురువారం స్థానిక ఎమ్మెల్యే దేవ హార్బరులో మౌలిక సదుపాయాలకు సంబంధించి కొన్ని పనులకు భూమిపూజ చేశారు. హార్బరులో జరిగే ప్రతీ అభివృద్ధి కార్యక్రమంతో గ్రామానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రతీ ఒక్కరికీ న్యాయం జరిగేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అంతర్వేది ఆధ్యాత్మికంగానే కాకుండా పారిశ్రామికంగా, పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. మినీ ఫిషింగ్‌హార్బరుతో ఉపాధి కల్పన, మత్స్య సంపదను ఇతర దేశాలు, రాష్ట్రాలకు ఎగుమతులు చేయడంతో ఆర్థికంగా గ్రామం మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో వనమాలి మూలాస్వామి, తిరుమాని ఆచార్యులు, బందెల పద్మ, మంగెన భూదేవి, గుబ్బల ఫణికుమార్, ముప్పర్తి నాని, ఒడుగు శ్రీను, పొన్నాల విజయ్, బర్రే శ్రీను, కూటమి నాయకులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు, స్థానిక మత్స్యకారులు తదితరులు పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

అయినవిల్లి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొవ్వూరుకు చెందిన బొడ్డు అనసూయ కుటుంబ సమేతంగా అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. విఘ్నేశ్వర అన్న ప్రసాద ట్రస్టుకు రూ.1,01,116 విరాళంగా సమర్పించారు.

గ్రామాల విభజనకు ప్రజలు వ్యతిరేకం

అంతర్వేది, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి, అంతర్వేదిపాలెం, వీవీమెరక మేజర్ పంచాయతీ గ్రామాల్లో జనాభా అధికంగా ఉండటంతో ఒక్కో గ్రామాన్ని రెండు పంచాయతీలుగా విభజన చేయాలని గ్రామసభలో ఓటింగ్ నిర్వహించారు. అయితే సఖినేటిపల్లి గ్రామ పంచాయతీలో విభజనకు అనుకూలంగా 18ఓట్లు, వ్యతిరేకంగా 114 ఓట్లు నమోదయ్యాయి. అలాగే అంతర్వేదిపాలెం, వీవీమెరక పంచాయతీల్లో కూడా విభజనకు వ్యతిరేకంగా ఎక్కువ శాతం ఓట్లు వచ్చాయి. త్వరలో పంచాయతీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో అధిక జనాభా, పెద్ద పంచాయతీలుగా ఉన్న ఈగ్రామాలను రెండుగా విభజించడానికి ప్రజలు అనుకూలంగా లేకపోవడంతో ప్రశ్నార్థకంగా మారింది. గ్రామ సభలో ఆయా సర్పంచ్‌లు, గ్రామపెద్దలు సమక్షంలో విభజన నమోదు కార్యక్రమం జరిగింది.

సుంకర నాయుడుకి ఎమ్మెల్యే గిడ్డి పరామర్శ



గంగాభవాని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, తదితరులు

అంబాజీపేట,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మాతృవియోగంతో బాధపడుతున్న జనసేన నాయకుడు సుంకర పేరయ్యనాయుడును ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ గురువారం పరామర్శించారు. సుంకర భవాని చిత్రపటం వద్ద ఎమ్మెల్యే నివాళులర్పించారు. సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, నాయకులు సుంకర బాలాజీ, కొర్లపాటి గోపి, నేదునూరి పెద్దిరాజు, దొమ్మేటి సాయికృష్ణ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

బాణసంచా దుకాణదారులు నిబంధనలు పాటించాలి

పి.గన్నవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాలకు తాత్కాలిక అనుమతులు ఇస్తామని ఆర్డీవో పి.శ్రీకర్ తెలిపారు. గురువారం తహశీల్దార్ పి.శ్రీపల్లవితో కలిసి ఆయన బాణసంచా దుకాణాల కోసం స్థల పరిశీలన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల19,20 తేదీల్లో బాణసంచా దుకాణాలకు తాత్కాలిక అనుమతులు ఇస్తామన్నారు. మండలం నుంచి 34మంది దరఖాస్తు చేశారన్నారు. పోతవరం, పి.గన్నవరం గ్రామాల్లో ఖాళీ స్థలాలను ఆర్డీవో పరిశీలన చేసి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు.

చెత్త ట్రాక్టర్‌ను అడ్డుకున్న గ్రామస్తులు

రాజోలు, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):సోంపల్లి పుష్కర ఘాట్ రేవు సమీపంలో ఏటిగట్టుపై రాజోలుకు చెందిన వ్యర్థాలు వేసి డంపింగ్ యార్డుగా మారుస్తున్నారని సోంపల్లి ప్రజలు గురువారం చెత్త ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. సర్పంచ్ కట్టా శ్రీనివాసరావు, వైస్ ఎపీ పొలమూరి శ్యామ్‌బాబు, పాలకవర్గ సభ్యులు అక్కడకు చేరుకుని ఏటిగట్టుపై వ్యర్థాలు వేస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. పంచాయతీ ట్రాక్టర్‌ను వెనక్కు పంపేశారు. దీంతో వివాదం సరద్దుమణిగింది. విప్పర్తి సాయిబాబు, శంకరపు ఆదినారాయణ, పోతుమూడి రవి పాల్గొన్నారు.

చెత్త సమస్యను పరిష్కరించాలని దీక్షలు

అమలాపురం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏడాదిగా బండారులంకలో చెత్త సమస్యను పరిష్కరించాలంటూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి రెండో రోజుకు చేరుకున్నాయి.నూకపెయ్యి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షల్లో 1వ వార్డుకు చెందిన సరెళ్ల మల్లేశ్వరరావు, జాన మల్లిబాబు, రాయుడు వెంకటేశ్వరరావు, నూకపెయ్యి ఆదిలక్ష్మి, ఆశపు పెద్దిరాజు, చింతపట్ల సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. శిబిరాన్ని వైసీపీ మండలశాఖ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవి, జడ్పీటీసీ అంకం హిమభారతి తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు. కామిశెట్టి శ్రీనివాస్, జాన గణేష్, రాయుడు రామకృష్ణ, బాసిన బూర్గారావు, బాసిన శివన్నారాయణ, ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, వాసా దొరబాబు, సరెళ్ల రామకృష్ణ, అంకం పెదరాజు, కూర్మా క్రీస్తుబాబు, పెదపూడి బాబూరావు, గోసంగి శ్రీను తదితరులు దీక్షను విరమింపచేశారు.

వెండి కిరీటాల బహూకరణ

మలికిపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మట్టపర్రులో వేంచేసి ఉన్న అభయాంజనేయస్వామి, షిర్డిసాయిబాబాలకు లక్కవరానికి చెందిన రుద్రరాజు రంగరాజు-వెంకటసుబ్బాయమ్మ దంపతులు రూ.50వేలు విలువైన వెండి కిరీటాలు, అభయహస్తం బహూకరించారు. గురువారం వాటిని సాయిబాబా, హనుమాన్ విగ్రహాలకు అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

అల్లవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): లివర్ వ్యాధితో బాధపడుతున్న బోడసకుర్రు గ్రామానికి చెందిన సంగాని వెంకటేశ్వర్లుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.51,310 చెక్కును ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు గురువారం అందజేశారు. కార్యక్రమంలో క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, అరవ చంటి, ఓలేటి పరమేశ్వరరావు, తెలుగు యువత మండల అధ్యక్షుడు ముత్యాల బాబి, రొక్కాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు వీరేశ్వరస్వామి హుండీల కానుకల లెక్కింపు

ఐ.పోలవరం, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీభద్రకాళీవీరేశ్వరస్వామి హుండీల కానుకల లెక్కింపు ఈనెల18న జరుగుతుందని ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు.

బౌద్ధ సదస్సును జయప్రదం చేయాలి

ముమ్మిడివరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కాకినాడ అంబేడ్కర్ భవనంలో ఈనెల19న నిర్వహించే బౌద్ధ సదస్సుకు బౌద్ధులంతా తరలివచ్చి జయప్రదం చేయాలని ఉపాసక పీఎస్ఎన్ మూర్తి పిలుపునిచ్చారు.ముమ్మిడివరం బార్ అసోసియేషన్‌కు పీఎస్ఎన్ మూర్తి బృందం గురువారం విచ్చేశారు. ఈ సందర్భంగా బౌద్ధ సదస్సు బ్రోచర్లను ఆవిష్కరించి న్యాయవాదులను ఆహ్వానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పీఎస్ఎన్ మూర్తి ముఖ్య అతిథిగా మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బీవీ రమణయ్య పుణ్యానుమోదన స్మృతి బౌద్ధ సదస్సు అక్టోబరు 19న కాకినాడ అంబేడ్కర్ భవనంలో జరుగుతుందన్నారు. న్యాయవాదులు బీర ప్రసాద్‌బాబు, ఎం.వెంకటేశ్వరరావు, జీవీ రామారావు, కాశి సిద్ధార్థ, టి.శాంతిసుధ, వడ్డి త్రిమూర్తులు, బొజ్జా రమేష్, బౌద్ధ ఉపాసులు ఎం.ఆశీర్వాదం, ఎం.కమల, ఎం.సత్తిబాబు, సీహెచ్.సత్తిబాబుపాల్గొన్నారు.

మాగాపు మృతికి సంతాపం

యానాం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): యానాంవర్తక సంఘం నేత, బీజేపీ యానాం మాజీ అధ్యక్షుడు మాగాపు సుబ్బారావు(56) మృతికి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ సంతాపం తెలిపారు. కనకాలపేటలోని ఆయన నివాసానికి వెళ్లి సుబ్బారావు మృతదేహాన్ని వారు సందర్శించి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. యానాం సివిల్‌రైట్స్ సొసైటీ అధ్యక్షుడు పోనుగుమట్ల విష్ణుమూర్తి, తెలగ అభ్యుదయ సంఘం అధ్యక్షుడు కాటంశెట్టి రామ్మూర్తి, వర్తక సంఘం అధ్యక్షుడు నల్లా వెంకన్న, అన్నాడీఎంకే కార్యదర్శి మంచాల సాయి, ఎన్ఆర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లాడి శామ్యూల్, మున్సిపల్ మాజీ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్, వ్యాపారవేత్త తోటరాజు, కనకాలపేట గ్రామపెద్దలు, ప్రజలు సంతాపం తెలిపారు.

ఎస్పీని కలిసిన టీడీపీ ఇన్‌చార్జి అమూల్య



రాజోలు, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): ఎస్పీ రాహుల్ మీనాను టీడీపీరాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. పూలమొక్కను అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు.

జయరాజ్‌కు పితృ వియోగం

ఉప్పలగుప్తం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ మండల ప్రధాన కార్యదర్శి పినిపే జయరాజ్ తండ్రి లక్ష్మణరావు(70) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ విచారం వ్యక్తం చేశారు. అమలాపురం వైసీపీ ఇన్‌చార్జి పినిపే శ్రీకాంత్, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, వైసీపీ మహిళ జిల్లా అధ్యక్షురాలు వంగా గిరిజానాగకుమారి, జిల్లా కార్యదర్శి పొగాకు శ్రీను, నాయకులు కుంచే రమణారావు, బద్రి బాబ్జి, దంగేటి రాంబాబు, మోటూరి సత్యం కాపు, చిక్కం బాలయ్య, పెయ్యల రాజ్‌కుమార్ తదితరులు విచారం వ్యక్తం చేశారు.

గూగుల్ రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి

మామిడికుదురు,అక్టోబరు16(ఆంధ్రజ్యోతి):గూగుల్‌రాకతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు అన్నారు. మగటపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నవ్యాంధ్రప్రదేశ్‌లో విశాఖ రెండో ఆర్థిక రాజధానిగా నిలుస్తుందన్నారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖమంత్రి లోకేశ్ అహర్నిశలు శ్రమించి ప్రసిద్ధిగాంచిన కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తున్నారని కొనియాడారు. సరెళ్ల సత్యనారాయణ, కుంచే శ్రీనివాస్ పాల్గొన్నారు.

సామూహిక సత్యసాయి వ్రతాలు

మామిడికుదురు, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడిలోని చెన్నమల్లేశ్వరస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను గురువారంనిర్వహించారు. 125 మంది భక్తులు పాల్గొని వ్రతమాచరించారు. స్వామివారి దివ్య పాదుకలు, దివ్య వస్త్రం, పూర్ణ కలశాన్ని స్థానిక బోనం బాపూజీ స్వగృహం నుంచి గ్రామోత్సవం నిర్వహించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం రూరల్, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి విద్యుత్ కేంద్రంలో టవర్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. అమలాపురం టౌన్, బాలయోగి ఘాట్, కామనగరువు, చల్లపల్లి, అంబాజీపేట, గంగలకుర్రు, కాట్రేనికోన 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): నగరంసబ్‌స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం 10నుంచి 3గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అమలాపురం ఈఈ కె.రాంబాబు తెలిపారు. బేఎక్స్‌స్టేషన్ పనులు, ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం నగరం, మామిడికుదురు, పాశర్లపూడి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, అప్పనపల్లి, పెదపట్నం, మొగలికుదురు, తాటిపాక గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): అల్లవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అల్లవరం, గోడిలంక, తూర్పులంక, యెంట్రుకోన, తాడికోన, రెల్లుగడ్డ పరిసర గ్రామాల్లో ఆక్వా చెరువులకు శుక్రవారం ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అమలాపురం ఈఈ కె.రాంబాబు తెలిపారు. బెండమూర్లంక సబ్‌స్టేషన్ పరిధిలోని ఓడలరేవు, ఆరగట్లపాలెం గ్రామాల్లో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా శుక్రవారం ఉదయం 8నుంచి 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): టి.చల్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల18న 33/11కేవీ లైన్ నిర్వహణ, 11కేవీ టి.చల్లపల్లి ఫీడర్, 11కేవీ ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్, 11కేవీ గోపవరం ఫీడర్ లైన్స్ మరమ్మతులు, ట్రీట్రిమ్మింగ్ నిర్వహిస్తున్నట్టు ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. శనివారం టి.చల్లపల్లి, గోపవరం, సరిపల్లి, ఎస్.యానాం, వాసాలతిప్ప, అల్లవరం మండలంలోని నక్కారామేశ్వరంగ్రామాలకుఉదయం 8నుంచి 2గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

కాట్రేనికోన,(ఆంధ్రజ్యోతి): ఈనెల18న కాట్రేనికోన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టుఅమలాపురంట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు తెలిపారు. ఈకారణంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): పేదలను ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. గురువారం అయినవిల్లిలో రూ.3.54లక్షల సీఎం సహాయనిధి చెక్కులను తొమ్మిది మందికి అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు వస్కా శ్యామ్, టీడీపీ కార్యదర్శి మద్దాల సుబ్బారావు, పోలిశెట్టి రాజేష్, సలాది పుల్లయ్యనాయుడు, మట్టపర్తి ప్రభాత్‌కుమార్, డీసీ కాకర శ్రీనివాస్, సలాది బుచ్చిరాజు పాల్గొన్నారు.

బ్యాంకు కెనాల్ ఆధునికీకరణకు చర్యలు

తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ సునీల్‌కుమార్



కె.గంగవరం మండలంలో లాకును పరిశీలిస్తున్న ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ సునీల్‌కుమార్

కె.గంగవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తూర్పు డెల్టా పరిధిలో బ్యాంకు కెనాల్ ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్ తెలిపారు. గురువారం కోటిపల్లి సెక్షన్ పరిధిలో బ్యాంకు కెనాల్, మసకపల్లి, కూళ్ల లాకులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ప్రాజెక్టు కమిటీ పరిధిలో కాలువలు, లాకులు, నీటిపారుదలశాఖ కార్యాలయాలను పరిశీలించామన్నారు. 210 కాలువల్లో పూడిక తీయడానికి, ఆధునికీకరించడానికి రూ.8.30 కోట్లు వెచ్చించామన్నారు. డ్రైనేజీ పరిధిలో 147 పనులకు రూ.5 కోట్లు వెచ్చించామని తెలిపారు. బ్యాంకు కెనాల్ నిండా ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోయాయని వాటిని నిరోధించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ సుధీర్‌రెడ్డి, యర్రపోతవరం డీసీ ఛైర్మన్ నిడదవేలు సుబ్రహ్మణ్యేశ్వరరావు, కోటిపల్లి డీసీ ఛైర్మన్ దాట్ల విజయగోపాలరాజు, రామచంద్రపురం డీసీ ఛైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, కాజులూరు కృష్ణ చైతన్య, సిరిపురం డీసీ ఛైర్మన్ పేపకాయల నారాయణరావు, నీటి సంఘం అధ్యక్షులు గోపి సతీష్, తాడాల లోవరాజు, ములకల విశ్వేశ్వరావు, నీటిపారుదల శాఖ ఈఈ రామకృష్ణ, డీఈలు పోచారావు, రమేష్, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాపేశ్వరం లాకుల పరిశీలన

మండపేట (ఆంధ్రజ్యోతి): ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, వైస్ ఛైర్మన్ తమలంపూడి సుధాకర్‌రెడ్డి గురువారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం వారు తాపేశ్వరంలో లాకులను సందర్శించారు. కార్యక్రమంలో డీసీ కమిటీ ఛైర్మన్‌లు, పడాల వెంకటరెడ్డి, నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి, ఏడిద సాగునీటి సంఘం అధ్యక్షుడు కొలుపోటి బాబు, కాజులూరు డీసీ ఛైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, డీసీలు అధికారులు నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

జనార్దనస్వామి ఆలయంలో శాంతి కల్యాణం

అలమూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అలమూరులోనున్న శ్రీదేవి భూదేవి సమేత నవజనార్దనస్వామి ఆలయంలో గురువారం స్వామివారికి శాంతి కల్యాణం నిర్వహించారు. గ్రామానికి చెందిన చిలకమర్తి సాయిదత్త, చిలకమర్తి శ్రీనివాస్ దంపతులు కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఆలయ అర్చకుడు ఖండవల్లి ప్రభాకరాచార్యులు, అంగర భగవాన్‌ల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిపారు. కల్యాణోత్సవంలో ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మన్ భైరిశెట్టి రాంబాబుతోపాటు పలువురు సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



జనార్దనస్వామి ఆలయంలో శాంతి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



అలమూరును తూర్పులో విలీనం చేయాలని కోరుతూ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

అలమూరును 'తూర్పు'లో విలీనంపై కరపత్రాల ఆవిష్కరణ

అలమూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అలమూరు మండలాన్ని తూర్పు గోదావరిలో విలీనం చేయాలని కోరుతూ గురువారం అలమూరులో జేఏసీ నాయకులు కరపత్రాలు విడుదల చేశారు. మండలాన్ని తూర్పు గోదావరిలో కలపాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ కరపత్రాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా జేఏసీ అధ్వర్యంలో కార్యాచరణతో ముందుకు సాగడానికి ఈ కరపత్రాలు ఎంతగానో ఉపకరిస్తాయని పలువురు నాయకులు అన్నారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణ స్థలాల పరిశీలన



కపిలేశ్వరపురంలో ఖాళీ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు

కపిలేశ్వరపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): దీపావళిని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న తాత్కాలిక బాణసంచా దుకాణాల ఏర్పాటు స్థలాలను తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఎస్‌ఐ హరీష్‌కుమార్, మండపేట ఫైర్‌స్టేషన్ అధికారులు గురువారం పరిశీలించారు. అంగరలోని సినిమా థియేటర్ వెనుక భాగం, కోరుమిల్లి చెరువుగట్టు, కపిలేశ్వరపురం హైస్కూల్ , టేకి గ్రామంలోని వాటర్ ట్యాంకు వద్ద గల ఖాళీ ప్రదేశాలను తనిఖీ చేసినట్టు వారు తెలిపారు. దుకాణదారులు 19, 20 తేదీల్లో ఆయా ప్రదేశాల్లో రెండు రోజులు మాత్రమే విక్రయాలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ అర్జమ్మ, వీఆర్‌వోలు, కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డీఎం తదితరులు

పంచారామాలకు ప్రత్యేక ప్యాకేజీ బస్సులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రానున్న కార్తీకమాసం సందర్భంగా ఈనెల 26 నుంచి వచ్చేనెల 17 వరకు పంచారామాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు పేపకాయల భాస్కరరావు తెలిపారు. గురువారం పంచారామాల ప్యాకేజీకి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ప్రజల సౌకర్యార్థం సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. బస్సుకు సరిపడిన ప్రయాణీకులు ఉంటే వారి గ్రామం వచ్చి శైవ క్షేత్రాలను దర్శించి తిరిగి గ్రామంలో దించుతామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్, ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య పరిరక్షణే కూటమి ప్రభుత్వ ధ్యేయం

రావులపాలెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గర్భిణిలు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రాష్ట్రీయ పోషణ మాసోత్సవాల్లో భాగంగా రావులపాలెం సీఆర్సీలో సీఆర్సీ అధ్యక్ష, కార్యదర్శులు తాడి నాగమోహనరెడ్డి, నల్లమిల్లి వీరరాఘవరెడ్డి కార్యవర్గ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక సీమంతాల కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ రెడ్డి అనంతకుమారి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, కొత్తపేట నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ పాల్గొన్నారు. నియోజకవర్గ పరిధిలోని 400 మంది గర్భిణిలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



రావులపాలెంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యానందరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

సమన్వయంతో పనిచేయాలి

రాయవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. రాయవరం మండల సమావేశం గురువారం ఎంపీడీవో కీర్తి స్పందన ఆధ్వర్యంలో ఎంపీపీ ఎన్.వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత రాయవరంలో జరిగిన బాణసంచా పేలుడులో మరణించిన వారికి సంతాపం తెలిపారు. అనంతరం జరిగిన సమావేశంలో శాఖల వారీగా అధికారులు వివరించారు. సమావేశంలో ప్రజా ప్రతినిధులు పలు సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఇన్‌చార్జి తహసీల్దార్ బీవీ భాస్కర్, ఏవో గోపాల్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కంపోస్టుయార్డులో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కంపోస్టుయార్డులో అగ్ని ప్రమాదం

మండపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ద్వారపూడి పంచాయతీ పరిధిలోగల కంపోస్టుయార్డులో మంటలు ఎగసిపడటంతో పంచాయతీ కార్యదర్శి ఏవీవీ రమణ ఫిర్యాదు మేరకు అనపర్తి అగ్నిమాపక సిబ్బంది వాటిని అదుపు చేశారు. అగ్నిమాపక అధికారి శ్రీనువాసరెడ్డి సారధ్యంలో మంటలను అదుపుచేశారు. యార్డు సమీపంలో గొడౌన్లు ఉండటం, మరోపక్క ప్రైవేటు పాఠశాల ఉండటంతో అక్కడి నుంచి వచ్చే పొగ కారణంగా విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల మూడుసార్లు మంటలను అదుపు చేశామని అగ్నిమాపకశాఖ అధికారి తెలిపారు. ఇక్కడి ఘటనపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన అన్నారు.

వాడపల్లి బ్రహ్మోత్సవాలకు మహిళల పయనం

అలమూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు ప్రతిరోజు అలమూరు నుంచి ఉచిత ప్రైవేటు బస్సులు ఏర్పాటు చేయడంతో భక్తులు తరలివెళుతున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి మహిళలకు ఉచిత ప్రైవేటు బస్సులు ఏర్పాటు చేయాలని సంకల్పించి మండలానికి రోజూ ఆరు ప్రత్యేక బస్సులను నియమించారు. దీంతో మహిళా భక్తులు బ్రహ్మోత్సవాలను తిలకించి వస్తున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఈదల సత్తిబాబు, సలాది నాగేశ్వరరావు తెలిపారు.



లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

మోడరన్ హ్యూమానిటీ క్లబ్ లోగో ఆవిష్కరణ

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మోడరన్ హ్యూమానిటీ క్లబ్ బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆవిష్కరించారు. మోడరన్ విద్యాసంస్థల అధినేత లయన్ జీవీ రావు హ్యూమానిటీ క్లబ్ విధి విధానాలు వివరించారు. అన్నార్థులకు మోడరన్ ఫ్యామిలీ సహకారం తో ఆహారాన్ని అందచేసే లక్ష్యంతో దీన్ని తలపెట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం 2028 నుంచి పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుందన్నారు.

'కల్తీ మద్యం ఏరులై పారుతోంది'

రావులపాలెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కల్తీ మద్యం ఏరులై పారుతోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెం వైసీపీ కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయనతో పాటు పార్లమెంటు పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శులు కర్రి పాపారాయుడు, చింతలపాటి శ్రీనివాస రాజు, పాటి శివకుమార్, చెల్లుబోయిన శ్రీనివాసరావు పాల్గొన్నారు. అనంతరం జరిగిన సమావేశంలో జగ్గిరెడ్డి మాట్లాడుతూ కల్తీ మద్యం ఏరులై పారుతోందన్నారు. బెల్ట్ షాపుల్లో అమ్మే మద్యం బాటిళ్లపై గుర్రపు బొమ్మ వేసి విక్రయిస్తున్నారన్నారు. రూ.190కు దొరికే మద్యం బాటిల్ బెల్ట్‌షాపులో రూ.230లకు విక్రయాలు సాగిస్తున్నారన్నారని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన

ఆత్రేయపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వద్దిపర్రు, వెలిచేరు గ్రామాల్లో గురువారం శాస్త్రవేత్తల బృందం పర్యటించారు. డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, వి.అనూషలు పలు పంటలు పరిశీలించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు.

జొన్నాడ ఫ్లైఓవర్ కాంట్రాక్ట్ రద్దు

• మళ్లీ టెండర్లకు అధికార యంత్రాంగం చురుగ్గా ఏర్పాట్లు • త్వరలో తొలగనున్న వాహనదారుల కష్టాలు

అలమూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అలమూరు మండలం జొన్నాడ ఫ్లైఓవర్ కాంట్రాక్ట్ రద్దయ్యింది. ప్రస్తుత కాంట్రాక్టు సంస్థ దీని నిర్మాణం చేపట్టడానికి విముఖత చూపించడంతో కాంట్రాక్టర్‌తో చేసుకున్న ఒప్పందాన్ని రద్దుచేసి మరోసారి టెండర్లు పిలవడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడేళ్లుగా వాటి పనులు నత్తనడకగా సాగు తూ ప్రజలకు, ప్రయాణికులకు తీవ్ర అసౌకర్యంగా మారింది. మండలంలోని పలు గ్రామాలకు ఎక్కడికి వెళ్లాలన్నా ఇక్కడ నుంచే రాకపోకలు సాగించాలి. సర్వీసు రోడ్ల పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఇక్కడి పను లను శృతి కాంట్రాక్టు సంస్థ ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అమలాపురం ఎంపీ హరీష్‌మాధుర్, జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్‌ల అధ్వర్యంలో పలుమార్లు రివ్యూ చేసినప్పటికీ పనుల్లో వేగం కన్పించలేదు. ఇటీవల అమరావతిలో జరిగిన జిల్లా కలెక్టర్ల సమావేశంలో జొన్నాడ ఫ్లైఓవర్ పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి కలెక్టర్ మహేష్‌కుమార్ తీసుకెళ్లారు. తక్షణమే పనులు ప్రారంభించకపోతే కాంట్రాక్టు రద్దు చేసి టెండర్లు పిలవాలని సూచించడంతో పాత కాంట్రాక్టర్ ఒప్పందాన్ని రద్దు చేసుకుని మళ్లీ టెండర్లు పిలవడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ అక్టోబరు నెలాఖారుకు పూర్తి చేసేలా అధికారులు యుద్ధ ప్రాతిపదికన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

రెండు, మూడు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు: టెండర్ల ప్రక్రియ పూర్తి చేసిన వెంటనే వీటి పనులు ప్రారంభించేలా అధికారులు పావులు కదుపుతున్నారు. దీంతో రెండు లేదా మూడు నెలల్లో వీటి పనులు పూర్తి చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో జొన్నాడ ఫ్లైఓవర్ బాధితులకు త్వరలో విముక్తి రానున్నట్టు తెలుస్తున్నది. మూడేళ్లుగా ఇక్కడ దుమ్ముతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నోసార్లు నాయకులకు, అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ కాంట్రాక్టర్ మొండికేయడంతో పనులు ముందుకు సాగలేదు. జొన్నాడ, మోరంపూడి వద్ద నిర్మించిన ఫ్లైఓవర్ ఒకేసారి శంకుస్థాపన జరిపారు. కాగా మోరంపూడి ఫ్లైఓవర్ పూర్తయి ఎన్నికల అనంతరం ప్రారంభించారు. త్వరలో జొన్నాడ ఫ్లైఓవర్‌కు కూడా మంచి రోజులు రానున్నాయి.



జొన్నాడ ఫ్లైఓవర్ వద్ద వాహనదారుల అవస్థలు





రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద వాహనదారుల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు. పక్క చిత్రంలో రామచంద్రపురంలో జీఎస్‌టీపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

జీఎస్టీ సంస్కరణలతో రవాణా రంగానికి మేలు

ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు

రావులపాలెం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 సంస్కరణలతో రవాణా రంగానికి ఎంతో మేలు కలుగుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద గురువారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆటో, క్యాబ్, మ్యాక్సీ వ్యాన్ డ్రైవర్లు నిర్వహించిన ర్యాలీని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాసరావుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంవీఐ ఓ.శ్రీనివాసు, నాయకులు గుత్తుల రాంబాబు, ఈదల సత్యనారాయణమూర్తి, చిన్నం శ్రీనివాసరెడ్డి, కొప్పిశెట్టి ప్రసాద్, తోట స్వామి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్‌టీ ఫలాలు అందరికీ అందుతాయి

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ సంస్కరణల ఫలాలు ప్రతి ఒక్కరికి చేరతాయని రాష్ట్ర జీఎస్‌టీ సహాయ కమిషనరు పి.సత్యనారాయణ, కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. గురువారం రవాణాశాఖ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఏర్పాటు చేసిన జీఎస్‌టీ తగ్గింపు అవగాహన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, ఎంవీఐ రాజేంద్ర ప్రసాద్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, కంచుమర్తి బాబూరావు, పార్టీ నాయకులు మేడిశెట్టి శేషారావు, కడియాల రాఘవన్, మేడిశెట్టి సూర్యనారాయణ, ఆటో యూనియన్ నాయకులు, యజమానులు, పలువురు డ్రైవర్లు, చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపార వర్గాలు పాల్గొన్నాయి.

తగ్గిన జీఎస్‌టీతో ప్రజలకు లబ్ధి

మండపేట(ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ ద్వారా ప్రతియేటా ప్రభుత్వానికి రూ.8వేల కోట్ల నష్టం వాటిల్లుతున్నప్పటికి, ప్రజల కోసం ప్రభుత్వం ఆ భారం మోస్తున్నదని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండపేటలో గురువారం స్థానిక ఆర్‌టీవో శ్రీదేవి సారధ్యంలో ఆయా వర్గాలకు చేకూరే లబ్ధిని వివరించారు. అనంతరం ఇన్‌చార్జి సీటీవో తిరుమలరావు తగ్గిన ధరలను వివరించారు. పట్టణంలోని పెద్దకాల్వ వంతెన వద్ద నుంచి బయలుదేరిన మినీ వాహనాలు, ఆటోలతో జరిగిన ర్యాలీని ఎమ్మెల్యే వేగుళ్ల ప్రారంభించారు. ఈ ర్యాలీ మెయిన్ రోడ్డు మీదుగా కలువపువ్వు సెంటరు వరకు సాగింది కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, మోటారు వాహనాల కార్మికులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మండపేటలో ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

టీడీపీలో చేరిన ఏడిద సర్పంచ్ ఆశీర్వాదం

మండపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం గురువారం స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమక్షంలో టీడీపీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన ఆయన్ను ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. ఆయనతోపాటు పంచాయతీ వార్డు సభ్యులు అల్లి శ్రీను, కప్పల కుమారి, కప్పల రాజేంద్రప్రసాద్, బొంతాల లక్ష్మితోపాటు బూరిగ నాగేశ్వరరావు, సుమన్, వారా అభిరామ్, డేగలపాటి రాజు, మనోహర్, రాకేష్, కె.శ్రీనివాస్‌లతోపాటు పలువురు పార్టీలో చేరగా వారందరికీ పార్టీ కండువాలను వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కర్రి తాతారావు, పి.వీర్రాజు తదితరులతో పాటు సహకార సంఘ అధ్యక్షుడు ఎర్రబ్బు, తెలుగు యువత అధ్యక్షుడు సురేష్, పలివెల దానియేలు, చిట్టూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యలను కమిటీ దృష్టికి తీసుకురావాలి

కొత్తపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీల సమస్యలను కమిటీ దృష్టికి తీసుకురావాలని మోనటరింగ్ కమిటీ ఛైర్మన్, కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ అన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో ఆయన అధ్యక్షతన కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్‌తో కలిసి ఎస్సీ, ఎస్టీ మోనటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు సంబంధించి పెండింగ్ కేసులపై తదుపరి చర్యల నిమిత్తం నివేదికలు వెంటనే తమ దృష్టికి తీసుకుని వెళ్లాలని సూచించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి దీనిపై సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశానికి ముందు సమస్యలు, సలహాలు, సూచనలతో పాటు ఆయా సమస్యలపై తీసుకున్న చర్యలపై నివేదికలు సిద్ధం చేసి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేయడం తగదన్నారు. సమావేశంలో కొత్తపేట డివిజన్ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొత్తపేట ఆర్డీవో శ్రీకర్

శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

కొత్తపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్టు లెవెల్-1లో కొత్తపేట శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ చాటారు. మొదటి లెవెల్‌లో 35 మంది విద్యార్థులు విజయం సాధించి లెవెల్ -2కు అర్హత సాధించినట్టు ప్రిన్సిపాల్ శివరామ్ తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు విజయం సాధించడం పట్ల ఆర్‌వి నరేష్, సతీష్, ప్రసాద్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు..

ఉషు పోటీల్లో రాజేశ్వరి ప్రతిభ



ఆత్రేయపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి ఉషు ఛాంపియన్ షిప్ పోటీలలో బొబ్బర్లంకకు చెందిన ఆకుమూరి రాజేశ్వరి 48 కిలోల విభాగంలో స్వర్ణపతకం సాధించారు. ఇటీవల 69వ రాష్ట్రస్థాయి ఉషు ఛాంపియన్ షిప్ స్కూల్ గేమ్స్ పోటీలు రాజమహేంద్రవరంలో అక్టోబరు 13, 14 తేదీల్లో అండర్ 19 బాలికల విభాగంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో రాజేశ్వరి స్వర్ణపతకం సాధించారు. ఈ నెల 26 నుంచి 30వ తేదీ వరకూ మణిపూర్‌లో జరిగే జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీలకు అర్హత సాధించారు.



కూళ్లలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న తనిఖీ బృందం

కేంద్ర నిధులతో చేపట్టిన పనుల పరిశీలన

కె.గంగవరం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన పనులు, ప్రాజెక్టులను అధికారుల బృందం గురువారం పరిశీలించారు. ఉపాధి హామీ పనులు, స్వయంశక్తి సంఘాల ప్రాజెక్టులు, గృహ నిర్మాణం, పీఎంఏజేవై పనులను వారు పరిశీలించారు. కూళ్ల, కోటిపల్లి తదితర గ్రామాల్లో లబ్ధిదారులతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఏపీడీ కె.సత్యనారాయణ, ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకుడు సురేంద్రనాథ్‌రెడ్డి, ఈసీ జీడీఎల్ సాగర్, డీఏ సురేంద్ర, గృహ నిర్మాణం, పలువురు అధికారులు పాల్గొన్నారు.